మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 169 వెల - రూ 5:00
Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ ఆమోదంపై అధిష్టానానికి ధన్యవాదాలు

- ఆయన అభ్యర్థిత్వాన్ని ఆమోదించిన రాష్ట్ర కాంగ్రెస్

హైదరాబాద్, (ప్రజా మంటలు): గచ్చిబౌలిలోని షెర్టాన్ హోటల్‌లో ఆదివారం సాయంత్రం సీఎల్పీ సమావేశం జరిగింది.




మిగతా 2లో..



# పాపన్న స్ఫూర్తితో ముందుకు వెళ్తాము

- ఈ విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది: మంత్రి పొన్నం
- టాంక్‌బండ్‌పై సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటు చేస్తాం
- ఆయన స్వస్థలాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం
- డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, (ప్రజా మంటలు): కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. రవీంద్ర భారతిలో సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు.

మిగతా 2లో..

# కోల్‌కతా హత్యాచార కేసును సుమోటోగా తీసుకున్న సుప్రీం

- ఘటనపై రేపు విచారించనున్న త్రిసభ ధర్మాసనం - కేసులో నిందితుడికి మానసిక పరీక్షలు




న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచార కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగస్టు 20న ఈ కేసును విచారించనుంది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన కేసును సుమోటోగా స్వీకరించాలని కోరుతూ ఇద్దరు న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. ఈ క్రమంలోనే కేసు విచారణ చేపట్టనున్నట్లు సుప్రీం వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఈ కేసును కలకత్తా హైకోర్టు ఇప్పటికే

మిగతా 3లో..

## పొలిట్రిక్స్

కమలంతో గులాబి
కలిసిపోవు ముచ్చట్లు,
పార్టీలో గుసగుసలు
నిజమేమో అన్నట్లు!

పేగుబంధం కోరకైనా
వేలిపోక తప్పదు,
ఈ 'స్నేహం' ఎన్నాళ్ళో
చూడాలిక మున్ముందు!

- న్యాలకంటి నారాయణ
9346200066

# కఠోర శ్రమ ఉంటే ఏరంగాంలోనైనా రాణిస్తారు

- క్షత్రియ సేవా సమితి అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాజులు ఏ రంగంలో అడుగుపెట్టిన అక్కడ కచ్చితంగా రాణిస్తారని, అంత నిబద్ధతతో పనిచేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అభినందన సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ రాష్ట్రంలో ఐదు లక్షల జనాభా క్షత్రియులు ఉన్నట్లు క్షత్రియ సేవా సమితి సభ్యులు సీఎంకు వివరించారు. అనంతరం క్షత్రియ భవనంతో పాటు క్షత్రియుల్లోని పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సీఎంను కోరారు. అలాగే తమకు రాజకీయాల్లోనూ అవకాశాలు కల్పించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ రాజ దర్పం ప్రదర్శించేలా అల్లూరి సీతారామరాజు పేరిట భవన నిర్మాణం చేపట్టాలని అందుకు ప్రభుత్వ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. విజయానికి, నమ్మకానికి క్షత్రియులు మారుపేరని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో కూడా అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. తొలుత పార్టీలో అవకాశం ఇస్తామన్న ఆయన, తర్వాత ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తామని మాట ఇస్తున్నట్లు చెప్పారు. విశ్రాంత ఐఏఎస్ శ్రీనివాసరాజును ప్రభుత్వ సలహాదారుగా నియమించామని ముఖ్యమంత్రి తెలిపారు. వారి ద్వారా క్షత్రియులు తనను కలవొచ్చని పేర్కొన్నారు. మీడియా, సినిమా రంగాల్లో రాజులదే పై చేయి అని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి అన్నారు. రెబల్ స్టార్ కృష్ణంరాజు, ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో పాటు బాహుబలితో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రభాస్?ను గుర్తు చేశారు. ప్రభాస్ లేకుండా బాహుబలి లేదని కితాబిచ్చారు. ఫ్యూచర్ సిటీలో రాజులు పెట్టుబడులు పెట్టాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక ఫైటర్ అని కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆయన మాటిస్తే తప్పకుండా నిలబడతారని క్షత్రియ సమాజానికి తెలిపారు. అంతకుముందు వందేమాతరం శ్రీనివాస్, గీతామాధురి, హనుమాన్?లు వాళ్ల పాటలతో అలరించారు. పారిశ్రామికవేత్త అల్లూరి సీతారామరాజుతో



పాటు ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన అందరికీ క్షత్రియ సేవా సమితి సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.




## దేశంలో అన్ని వైద్యకళాశాలలకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు

మిగతా 2లో..

## ఝార్ఖండ్ ప్రజల మధ్య బీజేపీ చిచ్చు

- నాయకులకు డబ్బుతో గాలం వేస్తోంది
- ఝార్ఖండ్ ప్రజల్లో చీలిక తెచ్చేందుకు యత్నిస్తోంది
- ఆదివాసీలు, మైనారిటీల్లో విషాన్ని వ్యాప్తి చేస్తోంది
- సీఎం హేమంత్ సోరెన్ ధ్వజం

మిగతా 3లో..

## ప్రజా నాడి




## ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో 'లేటరల్ ఎంట్రీ' నియమాకాలు సరికాదు

- కేంద్రంపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో 'లేటరల్ ఎంట్రీ' పద్ధతిలో భర్తీలను కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. యూపీఎస్సీకి బదులుగా ప్రత్యామ్నాయ మార్గంలో నియామకాలు చేపడుతూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని కేంద్రంపై విమర్శలు గుప్పించారు. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో 45 మంది సంయుక్త కార్యదర్శులు, ఉప కార్యదర్శులు/ డైరెక్టర్ల నియామకానికి యూపీఎస్సీ దరఖాస్తులను ఆహ్వానించిన వేళ రాహుల్ ఈమేరకు ట్వీట్ చేశారు."కేంద్ర శాఖల్లో లేటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు

మిగతా 2లో..

## అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది

- రుణమాఫీ ద్వారా రూ.19 వేల కోట్లు జమ చేశాం
- మిగిలిన రూ.12 వేల కోట్లను జమ చేస్తాం.
- వివిధ కారణాలతో ఆగిన మొత్తాన్ని త్వరలోనే లబ్దిదారుల ఖాతాల్లో వేస్తాం
- అన్నదాతలు సహనాన్ని కోల్పోవద్దు.. బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మొద్దు
- ఇచ్చిన హామీమేరకు జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేశాం :మంత్రి పొంగులేటి

హైదరాబాద్, (ప్రజా మంటలు): రుణమాఫీ ద్వారా రూ.19 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, వివిధ కారణాలతో ఆగిన మొత్తాన్ని త్వరలోనే లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా పరకాలలో పర్యటించిన ఆయన, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా

మిగతా 2లో..



## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

- వ్యానును ఢీకొన్న బస్సు
- 10 మంది మృతి 2లో



మొదటి పేజీ తరువాయి

## రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ ఆమోదంపై అధిష్ఠానానికి ధన్యవాదాలు

తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ తీర్మానం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, అభిషేక్ మను సింఘ్వీ ఎమ్మెల్యేలు, సీనియర్‌నేతలు హాజరయ్యారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాసరెడ్డి, కాలే యాదయ్య తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

# దేశంలో అన్ని వైద్యకళాశాలలకు ఎన్‌ఎంసీ మార్గదర్శకాలు

- ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని సూచన
- వైద్యుల ఆందోళనపై ప్రతి రెండు గంటలకు నివేదిక ఇవ్వండి
- అన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):

ఈ ఘటన నేపథ్యంలో ఇటీవల దేశంలో అన్ని వైద్యకళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) మార్గదర్శకాలు విడుదల చేసింది. జాతీయ స్థాయిలో డాక్టర్లు, వైద్య విద్యార్థులు, కళాశాల, ఆసుపత్రి పరిసరాల్లో భద్రతకు తగిన విధానాన్ని రూపొందించాలని సూచించింది. ఈ రక్షణ చర్యలు.. ఓపీడీ, వార్డులు, క్యాజువాలిటీ, హాస్టల్స్, నివాస ప్రాంతాలు సహా అన్ని బహిరంగ ప్రదేశాల్లోనూ ఉండేలా చూడాలని తెలిపింది. వైద్యులు, సిబ్బంది కారిడార్లలో తిరిగే సమయంలోనూ భద్రత ఉండేలా తగినంత రక్షణ సిబ్బందిని ఏర్పాటుచేయాలని పేర్కొంది.కాగా కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది.ఈ ఘటనకు నిరసనగా అన్ని రాష్ట్రాల్లో వైద్యులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిస్థితులపై ప్రతి రెండు గంటలకు ఒకసారి నివేదిక సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.దేశంలోని అన్ని రాష్ట్రాలలోని పోలీసు ఉన్నతాధికారులు ప్రతి రెండు గంటలకు మెయిల్, ఫ్యాక్స్ లేదా వాట్సాప్ ద్వారా కేంద్రానికి నివేదికలు పంపాలని హోంశాఖ ఆదేశించింది. వాటి ఆధారంగా పరిస్థితులను అంచనా వేసి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. అయితే, హత్యాచారం జరిగిన ఆసుపత్రిలో సంబంధిత అధికారుల నుంచి సరైన సమాచారం, మద్దతు లేకపోవడం, పోలీసులు నిందితుడికి సహకరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ కేసును కోర్టు సీబీఐకు అప్పగించిందని పేర్కొంది.

## పాపన్న స్ఫూర్తితో ముందుకు వెళ్తాము

కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ..” కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తాం. కులగణనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. 2 లక్షల మంది గీత కార్మికులకు సేఫ్టీ కిట్లు అందిస్తాం. సర్వాయి పాపన్న జీవితం మనందరికీ ఆదర్శం. చరిత్రలో నిలిచిపోయేలా సర్వాయిపేట కోటను అభివృద్ధి చేస్తాం. కుల వృత్తుల శిక్షణకు స్కిల్ వర్సిటీలో స్థానం ఉంటుంది” అని పేర్కొన్నారు.కాగా నడిబొడ్డున సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆయన జన్మస్థలాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.పాపన్న గౌడ్ పర్యాటక కేంద్రానికి రూ.4.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు.ఈ సర్దార్ పాపన్న 374వ జయంతి వేడుకలను పొన్నం అధ్యక్షతన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అధికారికంగా నిర్వహించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలతో పాటు గౌడ సంఘాల నేతలు సైతం రాష్ట్రవ్యాప్తంగా జయంతి ఉత్సవాల్లోసర్వాయి పాపన్న 374వ జయంతి సందర్భంగా ఆయన ధీర గాథను, జీవిత చరిత్రను నేతలు గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమంటూ స్మరించుకున్నారు. హనుమకొండ జిల్లా పరకాలలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలపై కొనసాగిన అణిచివేత దాడులకు వ్యతిరేకంగా పోరాడిన మహాయోధుడని కొనియాడారు. వేములవాడలో ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆ యోధుడి ఆలోచన విధానాన్ని యువత కొనసాగించాలన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని కేక్ కట్ చేశారు. సిద్దిపేట జిల్లా భూంపల్లిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య నివాళులర్పించారు. తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు పాపన్న అంటూ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వ్యాఖ్యానించారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరం నడిబొడ్డున పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన స్వగ్రామాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సర్వాయి పాపన్నకు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణభవన్‌లో జరిగిన జయంతి ఉత్సవంలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ , సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య పాల్గొన్నారు. సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ప్రారంభించింది తమ ప్రభుత్వ హయాంలోనేనని పేర్కొన్నారు.సిద్దిపేటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నివాళులర్పించారు. బడుగులకు రాజ్యాధికారం కొరకు పాటుపడిన మహానుభావుడు పాపన్న గౌడ్ అని సిరిసిల్లలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్మరించుకున్నారు. ఏదో ఒక జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గౌడన్నలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో ‘లేటరల్ ఎంట్రీ’ నియమాకాలు సరికాదు

చేపడుతూ.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారు. ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం దక్కడం లేదు. దీన్ని మెరుగుపరిచే బదులు.. లేటరల్ ఎంట్రీ ద్వారా వారిని ఆ పదవులకు దూరం చేస్తున్నారు. యూపీఎస్సీకి సిద్ధమవుతున్న ప్రతిభావంతులైన యువత హక్కులను కాజేస్తున్నారు. సామాజిక న్యాయాన్ని కాలరాస్తున్నారు. కీలకమైన ప్రభుత్వ పదవుల్లో చేరడం ద్వారా కొన్ని కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు ఏం చేస్తారనే దానికి ప్రధాన ఉదాహరణ ‘సెబీ’నే. ఈ విధమైన భర్తీ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం” అని రాహుల్ పేర్కొన్నారు.ప్రభుత్వ శాఖల్లో కార్యదర్శులుగా, సంయుక్త, ఉప కార్యదర్శులుగా, డైరెక్టర్లుగా ప్రైవేటు రంగంలోని ప్రతిభావంతులను నియమించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. సాధారణంగా ఈ నాలుగు పోస్టులకు అఖిల భారత సర్వీసు అధికారులను, గ్రూప్ ఏ అధికారులను నియమిస్తుంటారు. కొత్త విధానంలో కాంట్రాక్టు పద్ధతిపై నియామకాలు జరుపుతోంది. 2018లో 10 మంది సంయుక్త కార్యదర్శుల నియామకం కోసం తొలిసారిగా యూపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

బులంద్‌షహర్ (ప్రజా మంటలు):

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందారు. బులంద్‌షహర్ జిల్లాలో వ్యానును బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ఘటనాస్థలిలోనే పది మంది మృతి చెందగా.. మరో 27 మందికి గాయాలయ్యాయి. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.



# అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది

కాంగ్రెస్ సర్కార్ పని చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ధనిక రాష్ట్రం అని గత పాలకుల్లా గొప్పలు చెప్పడం కాకుండా, ప్రాధాన్యతా పరంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల భారం ఉన్నా, ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు.రుణమాఫీ ద్వారా రూ.19 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, వివిధ కారణాలతో ఆగిన మొత్తాన్ని త్వరలోనే జమ చేయనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్? రెడ్డి తెలిపారు. రుణమాఫీ అంశంలో బీఆర్ఎస్? నేతలు రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లిచ్చామని గత ప్రభుత్వం గొప్పలు చెప్పిందని, కానీ 50 శాతం కూడా నీళ్లివ్వలేదని సర్వే ద్వారా తేలిందని చెప్పారు. హనుమకొండ జిల్లా పరకాలలో పర్యటించిన మంత్రి, రూ.5 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులకు, రూ.11.75 కోట్లతో అమృత్ 2.0 మంచి నీటి సరఫరా పథకం పనులకు శంకుస్థాపన చేశారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ పథకం ద్వారా ఇప్పటికే సుమారు రూ.19 వేల కోట్లు జమచేశాం. మిగిలిన రూ.12 వేల కోట్లను జమ చేస్తాం. అన్నదాతలు సహనాన్ని కోల్పోవద్దు. ఇచ్చిన మాట నెరవేర్చేది ఇందిరమ్మ ప్రభుత్వం. ఏదైనా కారణాల వల్ల రైతులకు రుణమాఫీ అందకపోతే వారికి కూడా ఇస్తామని హామీ ఇస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ కూడా విడుదల చేశాం అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ‘కుడా’ ఛైర్మన్ ఇనగాల వెంకట రామిరెడ్డి హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపాలిటీ భవనంలో నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతోనూ, ప్రజా ప్రతినిధులతోనూ మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.



# జేఎంఎంలో అవమానం జరిగిందట!

## - పార్టీ మార్పుపై చంపయీ సోరెన్ లేఖ

రాంచీ (ప్రజా మంటలు):

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఝార్ఖండ్ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత చంపయీ సోరెన్ భాజపాలో చేరతారంటూ వస్తోన్న వార్తలపై ఆయన క్లారిటీ ఇచ్చారు.పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నందునే ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చిందన్నారు. అయితే, భాజపాలో చేరికపై స్పష్టత ఇవ్వనప్పటికీ తన ముందు మూడు మార్గాలున్నాయంటూ సుదీర్ఘ లేఖ విడుదల చేశారు.”పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న తర్వాత ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోవాల్సి వచ్చింది. ఈ రోజు నుంచి జీవితంలో కొత్త అధ్యాయం మొదలు కాబోతోందని ఇటీవలి శాసనసభా పక్ష సమావేశంలో చెప్పాను. నా ముందు మూడు మార్గాలున్నాయి. ఒకటి.. రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగడం, రెండోది.. సొంతంగా పార్టీ పెట్టడం, చివరగా.. ఎవరైనా తోడుగా నిలిస్తే వారితో కలిసి పనిచేయడం. ఇప్పటినుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు నా ముందు ఈ మూడు మార్గాలున్నాయి” అని చంపయీ సోరెన్ పేర్కొన్నారు.చంపాయీ సోరెన్ ఎక్స్ ఖాతా నుంచి ‘జేఎంఎం’ మాయం..

రాంచీ: ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ఝార్ఖండ్ ముక్తిమోర్చా నేత చంపాయీ సోరెన్ భాజపాతో చేతులు కలుపుతారనే ప్రచారం జోరందుకొంది.తాజాగా ఆయన తన ఎక్స్ (ట్విటర్) ఖాతా నుంచి జేఎంఎం పేరును తొలగించారు. దీంతో ఆయన పార్టీ మారడం ఖాయమే అనే అనుమానాలు మరింత బలపడ్డాయి. మరో వైపు ఆయన ఆరుగురు పార్టీ ఎమ్మెల్యేలతో ఆదివారం దిల్లీ చేరుకున్నారనే వార్తలు ఈ ఊహాగానాలకు ఊతమిస్తున్నాయి. ఏ సమయంలో అయినా ఆయన కాషాయ కండువా కప్పుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనావేస్తున్నాయి. అయితే, ఈ విషయంపై మీడియా ఆయనను ప్రశ్నించగా సొంత పని మీద దిల్లీకి వచ్చినట్లు పేర్కొన్నారు.చంపాయీతో ఉన్న ఎమ్మెల్యేలను పార్టీ సంప్రదించేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన పలువురు భాజపా(ఃఏఖ) అగ్రనేతలతో టచ్‌లో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తాజాగా ఆయన బెంగాల్ భాజపా నేత సువేందు అధికారి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చలు జరుపుతున్నట్లుగా సమాచారం. మరోవైపు ఈ ఊహాగానాలను శనివారం చంపాయీ సోరెన్ ఖండించారు. ‘ప్రస్తుతం ఎలాంటి వదంతులు వ్యాప్తి చెందుతున్నాయో నాకు తెలియదు. కాబట్టి అవి నిజమో కాదో చెప్పలేను. నేను ఎక్కడున్నానో అక్కడే ఉన్నా. వాటి గురించి నాకేమీ తెలీదు” అని పేర్కొన్నారు.భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జనవరి 31న అరెస్టు చేసింది. ఆ తర్వాత సోరెన్ కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్న చంపాయీ సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు. అనంతరం హేమంత్‌కు ఝార్ఖండ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అయితే, తనను సీఎం పదవి నుంచి తప్పించడంతో చంపయీ భాజపాలో చేరాలని నిర్ణయించుకున్నట్లుగా సమాచారం. ఈ విషయంపై భాజపా ఎంపీ దీపక్ ప్రకాశ్ స్పందిస్తూ “ఓ మంచి వ్యక్తిని సీఎం కుర్చీ నుంచి దింపేశారు. ఇది ఆమోదయోగ్యం కాదు. ఆయన చేసిన తప్పు ఏంటి..?” అంటూ ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది.

# రుణమాఫీపై రాహుల్,ఖర్గేకు కేటీఆర్ లేఖ

## - పూర్తిస్థాయిలో అమలు చేయకుంటే కాంగ్రెస్‌పై పోరాడతామని వెల్లడి

హైదరాబాద్, (ప్రజా మంటలు):

తెలంగాణలో రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. రాష్ట్రంలో రుణమాఫీ అందని లక్షలాది మంది రైతుల తరఫున ఈ లేఖ రాస్తున్నానని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఆ లేఖలో పొందుపరిచారు.వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకు రెండు లక్షల రుణమాఫీ హామీ ఇచ్చారు.. కానీ ఈ ప్రభుత్వం అనేక షరతులు పెట్టి 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. 40 వేల కోట్ల రూపాయల రుణమాఫీ అని చెప్పి కేవలం 17 వేల కోట్ల రుణమాఫీతో రైతులను నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రైతులందరికీ రుణమాఫీ చేయాలని తన లేఖలో డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా రోడ్లపై ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. రైతులందరికీ రుణమాఫీ చేయకుంటే వారి తరఫున కాంగ్రెస్ పార్టీపై పోరాడతామని ఆ లేఖ ద్వారా హెచ్చరించారు.“ గౌరవనీయులైన రాహుల్ గాంధీ గారు, మల్లికార్జున ఖర్గే గారికి..మీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్వాకం వలన దగా పడిన లక్షలాది మంది తెలంగాణ రైతుల తరఫున మీకు ఈ లేఖ రాస్తున్నాను. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఫల్యాలతో ముఖ్యంగా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్న రైతు రుణమాఫీ మోసం వలన లక్షలాదిమంది రైతులు తీవ్రమైన ఆవేదనలో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట మీరు విడుదల చేసిన హామీలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ అనేది అత్యంత కీలకమైన అంశం అనే విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.అబద్ధాలు, అభూతకల్పనలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఏకకాలంలో రెండులక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన సీఎం రేవంత్.. మూడు విడతలుగా మోసంచేస్తూ.. ఎనిమిది నెలలుగా ఊరించి ఊరించి చివరికి రైతులను ఉసూరుమనిపించారు. కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం రుణమాఫీ పూర్తయిపోయిందని ప్రకటించడం వందకు వందశాతం అబద్ధం. అందుకే తెలంగాణలో రుణమాఫీ పేరిట జరిగిన నయవంచనకు సంబంధించిన లెక్కలు మీకు తెలుసో లేదో అనే ఉద్దేశంతో సీఎం చెప్పిన అబద్ధాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలకు మధ్య ఉన్న స్పష్టమైన తేడాను ఈ లేఖలో పొందుపరుస్తున్నాను.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షరూపాయల రుణమాఫీ చేస్తేనే 17 వేల కోట్లు ఖర్చయింది. ఏకంగా 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులై లబ్ది చేకూరింది. కాంగ్రెస్ చెబుతున్నట్టు రెండు లక్షల రుణమాఫీ పూర్తయితే.. లబ్దిదారుల సంఖ్యతోపాటు రుణమాఫీ మొత్తం పెరగాలి, దాదాపు రెట్టింపు కావాలి. కానీ కేవలం 17,900 కోట్లతో రెండు లక్షల రుణమాఫీని పూర్తిచేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనం. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి తూతూమంత్రంగా చేయడం.. కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది.అసలు లక్ష రూపాయల రుణమాఫీ కన్నా.. రెండు లక్షల రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 14 లక్షలు తగ్గడం రైతు రుణమాఫీ ఏ మేరకు విఫలమైందో అద్దం పడుతుంది. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్క ప్రకారం రెండు లక్షల రుణమాఫీకి 49,500 కోట్లు అంచనా వేశారు. ముఖ్యమంత్రే స్వయంగా రుణమాఫీకి 40వేల కోట్ల వరకు అవుతుందని తొలుత చెప్పుకొచ్చారు. కడుపు కట్టుకుంటే.. ఇది పెద్ద విషయం కాదని ఇంటర్వ్యూల్లో గొప్పలు చెప్పారు. చివరికి రాష్ట్ర కేబినెట్ సమావేశం వరకు వచ్చే సరికి 31 వేలకు దీన్ని కుదించారు. కనీసం అంతమేరకైనా చేశారా అంటే అదీ లేదు. రాష్ట్ర బడ్జెట్ లో మరింత కోత పెట్టి 26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. తీరా మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో మమ అనిపించారు. 49,500 కోట్ల రూపాయల రెండు లక్షల రుణమాఫీ కాస్తా.. మూడు విడతల్లో దాదాపు మూడింతలు తగ్గి 17,933 చేరింది. 40 శాతం కూడా రుణమాఫీ చేయకుండా.. లక్షలాది మంది రైతులను నట్టేట ముంచి ప్రక్రియ పూర్తయిందని సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేయడంతో.. యావత్ తెలంగాణ ఇవాళ రైతుల ఆందోళనలతో అట్టుడుకుతోంది.ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ లో రుణమాఫీ కాని అన్నదాతలు రోడ్డెక్కారు. మంచిర్యాలలో రుణమాఫీ కాలేదని మనస్థాపం చెంది



ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. అటు కరీంనగర్ రాజీవ్ రహదారిపై అన్నదాతలు రాస్తారోకో నిర్వహించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. మొలంగూరులోని ఇండియన్ బ్యాంకు ఎదుట రైతులు బైఠాయించి నిరసన చేపట్టారు. వనపర్తిలో రైతువేదిక సాక్షిగా రుణమాఫీ కాని రైతులు అబద్ధాల ముఖ్యమంత్రికి పాలించే హక్కు లేదని నిలదీశారు. ఇటు జగిత్యాలలో రుణమాఫీ కాలేదని కెనెరా బ్యాంకు ముందు పెద్దఎత్తున ధర్నాకు దిగారు. ఇలా ఒకటా రెండు? రుణమాఫీ కాని అన్నదాతల ఆందోళనలతో యావత్ తెలంగాణ అట్టుడుకుతోంది. దేవుడి మీద ఓట్ల పెట్టి మరీ మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై రైతులోకం ఆగ్రహంతో ఊగిపోతోంది.ఇప్పటికే అనేక జిల్లాల్లో అప్పుల భారం భరించలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అడ్డగోలు ఆంక్షలు..అర్థంలేని షరతులతో ఒక ప్రహసనంగా మార్చిన రుణమాఫీని రైతులందరికీ పూర్తిచేయాలి. రైతు రుణమాఫీకి సంబంధించి మా పార్టీ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ కి కేవలం వారం రోజుల వ్యవధిలోనే 1,20,000 కు పైగా ఫిర్యాదులు వచ్చాయి.కాంగ్రెస్ అధిష్టానానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. రైతులను నిలువునా మోసం మోసం చేసిన ఈ రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తన వైఖరి మార్చుకొని రాష్ట్రంలోని అన్నదాతలందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రాష్ట్రంలోని అన్నదాతల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. అప్పటివరకు తెలంగాణ రైతాంగం పక్షాన పోరాటం చేస్తామని తెలియజేస్తున్నాను” అని లేఖలో పేర్కొన్నారు.

# ఎప్పటివరకైతే కులం ఉంటుందో అప్పటివరకు కుల సంస్కృతులు, భాష, ఆహార్యం ఉంటాయి..



## - సామాజిక తత్వవేత్త బి ఎస్ రాములు

- దూళిపాళ అరుణ, రచయిత్రి
8712342323

**(నిన్నటి సంచిక తరువాయి)**

**(ప్రసిద్ధ కథకులు, నవలాకారులు, సాహిత్య విమర్శకులు, సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు గారి 75వ జన్మదిన వజ్రోత్సవ సందర్భంగా బి.ఎస్.రాములుగారితో ప్రత్యేక ముఖాముఖి)**

14. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వ చైతన్యం కొరకు మీరు రాసిన 'కొత్తచరిత్ర' పుస్తకంలో కీలకమైన అంశాలేవి?

జ :- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కొన్ని వందల వ్యాసాలను రాయడం జరిగింది. అంటే ఈ కొత్త విజన్ ఎలా ఉండాలో, దానికి సంబంధించి నూతన ప్రణాళికలను గురించి మేము చర్చించిన విషయాలను, కేసీఆర్ చేయాలనుకున్న నూతన మార్పులను అన్నింటినీ అయిదు పుస్తకాలుగా వేయడం జరిగింది. అందులో మొదటి పుస్తకం 'కొత్త చరిత్ర' రెండవది 'బంగారు తెలంగాణ', మూడవది 'తెలంగాణ విజన్ దేశానికి దిక్సూచి', నాల్గవది 'కొత్త సిలబస్', ఐదవది 'ఇండియాలో ఫెడరలిజమ్'..కొత్తరాష్ట్రంలో కొత్త విజన్ తో ముందుకు సాగి సమర్థవంతంగా ఆచరణ చేయ గలిగితే దేశానికి ఆదర్శంగా నిలుస్తుందనేది వాటి అంతస్సారం. తెలంగాణ ప్రభుత్వం 416 దాకా ప్రణాళికలను ప్రవేశపెట్టింది. అందులో కొన్నయినా అమలు అవుతాయన్న ఆశ. అయితే ప్రవేశపెట్టడం మాత్రమే జరిగింది. కానీ అమలు చేయలేదు. పైగా అవినీతి, ఆస్తులు పెంచుకోవడం మొదలైన స్వార్థ ప్రయోజనాలను ఎప్పుడైతే ఆశించారో 50 ఏళ్ళ ఉద్యమ ఫలితాలు ప్రజలకు అందలేదు. అట్లాంటి వాటన్నిటినీ చూపిస్తూ ఈ పుస్తకాల్లో విమర్శలు కూడా రాశాను. మంచి జరగలేదని అనను. కానీ ఉద్యమ ఫలితమైతే పూర్తి స్థాయిలో అందలేదు. ఉద్యమకారులకు సరైన న్యాయం జరుగలేదు. కేవలం రాజకీయ నాయకులకు ప్రయోజనం చేకూరింది. అస్సాం వంటి ఇతర రాష్ట్రాల్లో విద్యార్థులు, యువకులు, లెక్చరర్లే మంత్రులు, ముఖ్యమంత్రులు అయ్యారు. ఇక్కడ ఆ అవకాశం కొద్దిమందికే దక్కింది.

15. ఇప్పటి వరకు మీ లేఖిని నుండి వెలువడిన పుస్తకాలెన్ని?

జ :- నా రచనలు మొత్తం 120 పుస్తకాలుగా వెలువడ్డాయి. వాటిలో కథలు, నవలలు 21,తత్త్వ శాస్త్రానికి సంబంధించినవి 17, రాజకీయాలు, వ్యక్తిత్వ వికాసానికి చెందినవి 14, అలంకారశాస్త్రాలు, బిసిల గురించి రాసినవి 9, తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు, చరిత్ర, సంస్కృతికి, రాష్ట్రసాధనకు సంబంధించినవి 42 ఉన్నాయి. మూడు వందలకు పైగా పుస్తకాలకు పీఠికలు రాశాను. సాహిత్య చరిత్రను కొత్తమలుపుతో ఎలా చూడాలని తెలంగాణ దృష్టితో, బిసిల దృష్టితో, తెలంగాణ సాహిత్య చరిత్రను పునర్మూల్యాంకనం చేయడం జరిగింది. అట్లాగే తెలంగాణ కథ, అస్తిత్వం మీద రాయమని సి. నారాయణ రెడ్డిగారు అడిగారు. తెలంగాణ కథల్లో, నవలల్లో తెలంగాణ అస్తిత్వం ఎలా ఉందో దాని గురించి పుస్తకం వేశాను. ఆర్థిక విషయాలను దృష్టిలో పెట్టుకొని అర్థశాస్త్రం మీద రాశాను. స్వీయచరిత్ర కూడా 5 భాగాలుగా రాశాను. 1982 డిసెంబర్, అంటే ఎన్టీ రామారావు ఎన్నికల ప్రచారం చేస్తున్నంతవరకు స్వీయచరిత్ర పూర్తయింది. ఇప్పటికే 1200 పేజీలు అయింది (నవ్వుతూ). మిగతాది పుస్తకరూపంలో రావాల్సి ఉంది. ఉపన్యాసాలివ్వడం, సామాజిక ఉద్యమాలను ఆర్గనైజ్ చేయడం, విప్లవోద్యమంలో పాల్గొనడం, ఇట్లా నా జీవితమంతా పుట్టి బుద్ధి ఎరిగినప్పటి నుండి సామాజిక కార్యకలాపాలతోనే సహవాసం చేశాను. అందువల్ల నేను రాయదలచుకున్న దాంట్లో పదిశాతమే రాయగలిగాననుకుంటున్నా. శరత్ బాబు, ఠాగూర్, మున్షీ ప్రేమ్ చంద్ వీళ్ళలాగా నిరంతరం రాయాలి. కానీ సమాజం, చరిత్ర, ఉద్యమాలు నాకా అవకాశం ఇవ్వలేదు. అన్యాయాన్ని, వివక్షతను ఎదిరించే క్రమంలోనే సమయమంతా గడిచిపోయింది. అందువల్ల తపన ఉన్నా రాయలేకపోయాను.

16. సాహిత్య చరిత్రలో మార్పు తేవాలనుకున్నారు కదా! తీసుకురాగలిగారా?

జ :- కచ్చితంగా వచ్చింది. అన్నింటికన్నా ముఖ్యంగా సాహిత్య చరిత్రను మలుపు తిప్పాలనుకున్నాను. తిప్పాను కూడా. సామాజిక, తాత్విక, సాంస్కృతిక రంగాలలో నూతన కోణాలను ముందుకు తేవడం జరిగింది. మొత్తం సమాజం ఆమోదించింది. 1970 దశాబ్దం విరసం దశాబ్దం.1980-90 వరకు మహిళా దశాబ్దం. 1990 నుండి దళిత బహుజన దశాబ్దం. భారతదేశంలో కులమనేది ఒక వాస్తవం. ఆ కుల సంస్కృతులు పుట్టుక నుండే అలవడుతాయి. అందుకే నేను అలంకారశాస్త్రం రాశాను. ఒక కుటుంబం గురించి కథ రాసినా, నవల రాసినా, సినిమా తీసినా అది తప్పక ఏదో ఒక కులానికి చెందినదై ఉంటుంది. అలాగే దళితులు రాసినటువంటి రచనలు వాళ్ళ కులవృత్తులకు, వారి సంస్కృతులకు సంబంధించినవే ఉంటాయి. ఎప్పటివరకైతే కులం అనేది ఉంటుందో అప్పటివరకు కుల సంస్కృతులు, భాష, ఆహార్యం, జీవనవిధానం ఇవన్నీ ఉంటాయి. చైతన్యం పెరగకపోతే అదే సంస్కృతి కొనసాగుతూ ఉంటుంది. ఆర్థికంగా మెరుగుపడినా పాత సంస్కృతిలో మార్పు రాకపోగా విస్తరించింది. దాన్ని మార్చాలి. ఆ దిశగా చైతన్యులను చేయాలి. అందుకే ఆర్థిక విప్లవం కన్నా భావజాల విప్లవం కోసం కృషి చేశాను. సమస్త వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, ప్రాంత, భాష వివక్షతలకు, అసమానతలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ, సమానత్వం కోసం సామాజిక, సాహిత్య, తాత్విక రంగాల్లో కృషి చేస్తున్నాను. భారత రాజ్యాంగ మౌలిక లక్షణం కూడా అదే కదా! మనం ప్రపంచ సాహిత్యాన్ని చదువుతున్నాం. మన భారతీయ సాహిత్యాన్ని, తెలుగు సాహిత్యాన్ని వాళ్ళెందుకు చదవడం లేదు? అందుకే నేను కొన్ని అనువాదాలు చేయించాను. నేను అమెరికాకు వెళ్ళినప్పుడు ఎన్నో పుస్తకాలు చదివాను. అక్కడి జీవితాన్ని కళ్ళారా చూశాను. మన సాహిత్యం వాళ్లకు అంటదని అర్థమైంది. వాళ్లు ఉమ్మడి కుటుంబాల జీవితాలను వదిలేసి వందేళ్ళ పైన అయింది. వాళ్ళకు కులాలు, కుల వృత్తులు లేవు. అందుకే మన పరిస్థితుల కనుగుణంగానే సిద్ధాంతం తయారవ్వాలి. లక్ష్యాలు ఏర్పడాలి. అందుకే అటువంటి సాహిత్యం రాయాల్సి వచ్చింది.

17. 'విశాల సాహిత్య అకాడెమీ' ద్వారా మీరు చేస్తున్న కృషి మరికొంత వివరించండి.

జ :- మేము విప్లవ రచయితల సంఘంలో పని చేసినప్పుడు మా పుస్తకాలను అచ్చు వేసుకోవడం కోసం 'హైదరాబాద్ బుక్ ట్రస్ట్' స్ఫూర్తితో కరీంనగర్ బుక్ ట్రస్ట్ పేరు పెట్టి 'నా బతుకు పోరు' నవలని, అల్లం రాజయ్య 'భూమి' కథల సంపుటిని అచ్చు వేయడం జరిగింది. సింగరేణి కార్మికుల 'సింగరేణి కథలు' అచ్చు వేశాం. 'అడవిలో వెన్నెల' పేరుతో గిరిజనుల కథలను కూడా అచ్చు వేశాం. నేను అజ్ఞాతంలోకి వెళ్ళాక దాన్ని ఎవరూ ముందుకు తీసుకు వెళ్ళలేదు. 1990 లో నేను బయటకు వచ్చాక 'విశాల సాహిత్య అకాడెమీ' పేరుతో తిరిగి ప్రచురణలు ప్రారంభించాను. నా పుస్తకాలతో పాటు 75 ఇతరుల పుస్తకాలు కూడా వేశాం. ప్రతీ ఏటా విశాల సాహితీ పురస్కారాలు కూడా ఇస్తున్నాం. వందలాది మంది వాటిని అందుకున్నారు. మా కాలంలో మమ్మల్ని ప్రోత్సహించిన వాళ్ళు ఎవరూ లేరు. ఇప్పుడు అలాంటి దుస్థితి ఎవరికీ రాకూడదని శిక్షణా తరగతులు, చర్చలు, సదస్సులు నిర్వహించాం. వారి రచనలను సవరించి చక్కగా ముద్రించి ప్రోత్సహిస్తూ వస్తున్నాం.

18. 'నడుస్తున్న గ్రంథాలయం' గా మిమ్మల్ని అభివర్ణించిన గొల్లపూడి మారుతీరావు సాహిత్య సంచికలో మీ 'బతుకు పయనం' కథ ఎంపిక కావడం పట్ల ఎలాంటి అనుభూతి చెందారు?

జ :- హెచ్ ఎమ్ టి వి లో ప్రసారమైన 'నూరేళ్ళ కథ' అనే శీర్షికను గొల్లపూడి వారు నిర్వహించారు. నేను ఏ కథ ఇవ్వాలా? అని ఆలోచించాను. విభిన్న తరహాలో ప్రత్యేకంగా ఉన్న దానిని తీసుకోవాలి అనుకున్నాను. 'బతుకుపయనం' ఒక బట్టలు నేసే పద్మశాలీ సామాజిక వర్గం నుండి ఒక యువకుడు బిటెక్ చేసి, అమెరికాకు ఎట్లా పోగలిగాడో చెప్పే ఒక పరిణామాన్ని ఆవిష్కరించిన కథ బాగుంటుందనుకున్నాను. . అత్యంత పేదరికం నుండి అత్యున్నతస్థాయి ఉద్యోగం చేసే విధంగా అతని బతుకుపయనం ఎట్లా సాగిందో వివరించే కథ. అందులో బిసిల సంస్కృతి, ఆలోచనలు, పెళ్ళిచూపులు, పెట్టుబడులు మొదలగు ఎన్నో విషయాలుంటాయి.

విశాలాంధ్ర వారి 'నూరేళ్ళ తెలంగాణ కథ' పుస్తకంలో నేను రాసిన 'దక్షయజ్ఞం' కథ చేర్చారు. దీన్ని నేను ఎంపిక చేసుకోవడానికి కారణం కూడా విభిన్నంగా ఉండడమే. ఇందులో పీడితుల గురించి రాశాను. అంటే ఈ రెండూ కూడా వైవిధ్యంగా ఉన్న కథలు. ఒక చైతన్య స్ఫూర్తితో ఈ రెండింటిని ఎంపిక చేశాను. గొల్లపూడి మారుతీరావు గారు మా ఇంటికే వచ్చి నన్ను ఇంటర్వ్యూ చేసి దాన్ని ప్రసారం చేశారు.

**(మిగిలిన ఇంటర్వ్యూ రేపు కొనసాగుతుంది)**

# హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం..

## - ట్రాఫిక్‌కు అంతరాయం



హైదరాబాద్ (ప్రజా మంటలు):
నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. హయత్‌నగర్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, కోఠి, నాంపల్లి, సోమాజిగూడ, ఉప్పల్, తార్నాక, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తోంది.దీంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చాదర్‌ఘాట్ నుంచి ఎల్బీనగర్‌వైపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివిధ చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో వచ్చే మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు తెలిపింది.

# ఝార్ఖండ్ ప్రజల మధ్య బీజేపీ చిచ్చు

- నాయకులకు డబ్బుతో గాలం వేస్తోంది
- ఝార్ఖండ్ ప్రజల్లో చీలిక తెచ్చేందుకు యత్నిస్తోంది
- ఆదివాసీలు, మైనారిటీల్లో విషాన్ని వ్యాప్తి చేస్తోంది
- సీఎం హేమంత్ సోరెన్ ధ్వజం

రాంచీ (ప్రజా మంటలు):
ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరెన్ భాజపాలో చేరతారంటూ ఊహాగానాలు వస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు జరగడం గమనార్హం . ఈ క్రమంలోనే జేఎంఎం నేత, సీఎం హేమంత్ సోరెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రజల్లో చీలిక తెచ్చేందుకు భాజపా యత్నిస్తోందని, డబ్బుతో ఎమ్మెల్యేలకు గాలం వేసేందుకూ ఆ పార్టీ వెనుకాడబోదని ఆరోపించారు.ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీల్లో విషాన్ని వ్యాప్తి చేసి.. వారు పరస్పరం పోట్లాడుకునేలా.. అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్‌ల నుంచి కొంతమందిని భాజపా ఇక్కడ దించింది. సమాజంలో విభజనలు తేవడమే కాదు.. కుటుంబాలు, పార్టీలనూ విచ్ఛిన్నం చేసే పనిలో పడింది. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ఆ పార్టీకి అలవాటే. డబ్బు విషయమే వస్తే.. రాజకీయ నాయకులు పార్టీలు మారేందుకు ఎక్కువ సమయం పట్టదు" అని గోడ్డా జిల్లాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో సీఎం హేమంత్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రతిపక్ష పార్టీ నిర్ణయిస్తుందని, ఎన్నికల సంఘం కాదని విమర్శించారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో భాజపా తుడిచిపెట్టుకుపోతుందన్నారు.మరోవైపు.. తనకు జేఎంఎంలో అవమానాలు జరిగాయంటూ చంపయీ సోరెన్ ఇప్పటికే ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నందునే ప్రత్యామ్నాయం కోసం చూడాల్సి వచ్చిందన్నారు. అయితే, భాజపాలో చేరికపై స్పష్టత ఇవ్వలేదు.

# కమలా హారిస్‌పై ట్రంప్ వ్యక్తిగత విమర్శలు

న్యూయార్క్ (ప్రజా మంటలు):
డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ భయంకరంగా నవ్వుతుందని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు.ఆయన పెన్సిల్వేనియాలోని విల్కెస్-బారేలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కమలా హారిస్‌పై తీవ్ర స్థాయిలో వ్యక్తిగత విమర్శలు చేశారు. దీంతోపాటు.. అమెరికాలోని ప్రధాన పత్రికలను కూడా తప్పుపట్టారు. కమలా హారిస్ నవ్వడంపై నిషేధం ఉందని వ్యాఖ్యానించారు. దీంతో ఆమె నోరు మూసుకుని తిరుగుతోందని.. ఆమె నవ్వాలని.. తాను కూడా అదే కోరుకుంటున్నానని వెటకారంగా పేర్కొన్నారు. టైమ్ మ్యాగజైన్ వద్ద కమలా హారిస్ ఫొటోలే లేవని ఎద్దేవా చేశారు. వారి కళాకారులు మాత్రం ఆమె డ్రాయింగ్ వేస్తారన్నారు.కమలా ఏ విషయాన్నైనా చెత్తగా చెబుతారని ట్రంప్ విమర్శించారు. ఆమె మాటల్లోనే అబద్ధాలు దొరికిపోతాయని పేర్కొన్నారు. అమెరికాలో ఉద్యోగాలు పెంచడానికే విదేశాలపై టారిఫ్‌లు విధిస్తామన్నారు. కమలా హారిస్ మార్క్సిస్ట్ పాలసీలను అనుసరిస్తారని.. ఆమె తండ్రి కూడా మార్క్సిస్ట్ ఎకనామిక్ ప్రొఫెసరన్నారు. అమెరికా కలలను జోబైడెన్-హారిస్ చంపేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను బైడెన్‌కు వ్యతిరేకంగా బరిలోకి దిగానని.. హఠాత్తుగా ఏమైందో కానీ.. ఇప్పుడు హారిస్‌పై పోటీ చేస్తున్నాన్నారు.అమెరికాలోని ఏబీసీ సంస్థ ఎన్‌బీసీ, సీబీసీ, సీఎన్ఎన్ కంటే అత్యంత దారుణమైందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఇక సీఎన్ఎన్ ఊళ్లో రెండో ప్రపంచ యుద్ధం వచ్చినా.. అంతాబాగానే ఉందని చెబుతుందన్నారు. ఆ సంస్థ విలేకరిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు.

## మధురబంధాల రక్షాబంధనము

ఈ రక్షాబంధన ఉత్సవము
ప్రేమతో సాగాలి
ఒకరికొకరు రక్షకట్టుకొని
స్నేహంతో మెలగాలి
మధురానుబంధాల సంకేతంగా
ఈ రక్షాబంధన ఉత్సవాన్ని
అందరం అమితోత్సాహంగా
జరుపుకోవాలిజి

మహిమాన్వితమైనదిజి
ఈ భరతభూమి
ముని జనులకు
నిలయమైనదిజి
ఈ తపోభూమి
దేవతలకు జన్మ స్థలము
ఈ పవిత్ర భూమి
యుగయుగాలుగాజి
జ్ఞాన భిక్ష ప్రసాదించినది
ఈ వేద భూమి
ఈభూమి వారసత్వాన్ని రక్షించగ
దీక్షబూని అందరము జరపాలి
ఈ రక్షాబంధన ఉత్సవము

దేవేంద్రుడిలో ధైర్యాన్ని
మేల్కొలిపింది
సతి శచీ దేవి కట్టిన
రక్షా బంధనము
భరతుడిలో పరిపాలనా
దక్షతను పెంచింది
తల్లి శకుంతల కట్టిన
రక్షాబంధనము

సనాతన భారతీయ వారసత్వ
దివ్య సందేశము
ఈ రక్షాబంధన ఉత్సవము
పరస్పర ప్రేమాభిమానాలకు
నిలువెత్తు సాకారము
ఈ రక్షాబంధన ఉత్సవము

"సాహిత్య కళా విభూషణ"
చౌడూరి నరసింహారావు
కవి,రచయిత,విశ్లేషకుడు
నంది పురస్కార గ్రహీత

# కోల్‌కతా హత్యాచార కేసును సుమోటోగా తీసుకున్న సుప్రీం

సీబీఐకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. విచారణను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ప్రధాన నిందితుడికి మానసిక సామర్థ్య పరీక్షలు నిర్వహించనుంది. కాగా కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనకు నిరసనగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వైద్యులు ఆందోళనలు చేపడుతున్నారు. మరోవైపు సీబీఐ ఈ కేసు విచారణను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలోనే నిందితుడికి మానసిక పరీక్షలు నిర్వహించాలని సీబీఐ నిర్ణయించినట్లు సమాచారం.ఓ మీడియా సంస్థ కథనం ప్రకారం.. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీస్ (సీఎఫ్ఎస్ఎల్) నుంచి ఐదుగురు నిపుణుల బృందం సీబీఐ పర్యవేక్షణలో నిందితుడు సంజయ్ రాయ్‌కు మానసిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆ బృందం ఇప్పటికే నగరానికి చేరుకుంది. ముందుగా సిద్ధం చేసుకున్న జాబితా నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ పరీక్షల అనంతరం కోర్టు అనుమతితో బ్రెయిన్ మ్యాపింగ్, లై డిటెక్టర్, నార్కో అనాలిసిస్ వంటి ఇతర పరీక్షలు సీబీఐ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా కోల్‌కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాలలో రెసిడెంట్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన తృణమూల్ కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది.పార్టీ నేతలే పరస్పరం తప్పు పట్టుకునే పరిస్థితి నెలకొంది. తాజాగా ఆ పార్టీ నేత సుఖేందు శేఖర్ రాయ్ ఈ కేసు విచారణలో సీబీఐ నిక్కచ్చిగా ఉండాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. కళాశాల మాజీ ప్రిన్సిపల్, పోలీస్ కమిషనర్‌ను కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాలని కోరారు. వారు ఆత్మహత్య కథను తెరపైకి ఎందుకు తెచ్చారో తెలుసుకునేందుకు ఇది అవసరమని పేర్కొన్నారు. అసలు సెమినార్ హాల్ గోడను ఎందుకు కూల్చారని ప్రశ్నించారు. నిందితుడు అంత శక్తిమంతంగా అయ్యేందుకు ఎవరు కారణమని విమర్శించారు. పోలీసు జాగిలాలను రప్పించేందుకు మూడు రోజుల సమయం ఎందుకు పట్టిందని నిలదీశారు. ఇలాంటి వందల ప్రశ్నలే ప్రజలను మాట్లాడేటట్లు చేశాయన్నారు.ఈ పోస్టుపై అదే పార్టీకి చెందిన మరో నేత కునాల్ ఘోష్ ఎక్స్‌లోనే స్పందించారు. సుఖేందు శేఖర్ రాయ్ పోస్టును రీపోస్టు చేశారు. "నేను కూడా ఈ ఘటనలో న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నాను. సీపీ ఈ కేసు విషయంలో శక్తివంచన లేకుండా ప్రయత్నించారని తెలిశాక.. ఆయన విషయంలో వస్తున్న డిమాండ్లను వ్యతిరేకిస్తున్నాను. వ్యక్తిగతంగా సీపీ తన పనిచేశారు. దర్యాప్తు సానుకూల కోణంలో సాగుతోంది. మా సీనియర్ లీడర్ నుంచి ఇలాంటి పోస్టు దురదృష్టకరం" అని పేర్కొన్నారు.మరోవైపు పార్టీ నేత సుఖేందు శేఖర్ రాయ్‌కు పోలీసులు సమన్లు జారీ చేశారు. జాగిలాల విషయంలో ఆయన తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని వారు చెబుతున్నారు. ఇప్పటికే ఈ కేసుపై మాట్లాడిన భాజాపా నేత లాకెట్ ఛటర్జీ, వైద్యులు కునాల్ సర్కార్, సుబర్ణో గోస్వామికి కూడా పోలీసులు నోటీసులు పంపారు.కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో నిందితుడు వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన కేసు దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ ఘటనలో ఎన్నో అనుమానాలు ప్రజల మదిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేసును సీబీఐ దర్యాప్తు చేపట్టింది. అదే సమయంలో ఆధారాలను చెరిపేసేందుకు అల్లరి మూకలు యత్నించడం, పోలీస్ కమిషనర్ హడావుడిగా ప్రెస్‌మీట్ పెట్టి పలు విషయాలను మీడియాకు చెప్పడం చర్చనీయాంశమైంది.

**అది ఆత్మహత్య కాదని ముందే చెప్పా:కోల్‌కతా వైద్యురాలి తల్లి**

కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది.ఈ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రులు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సంఘటనలో చాలా మంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఆ రోజు సంఘటనను గుర్తుతెచ్చుకొని బాధితురాలి తల్లి కన్నీటిపర్యంతమయ్యారు."మీ కూతురికి ఆరోగ్యం బాగలేదని శుక్రవారం ఉదయం 10:53 గంటలకు ఆసుపత్రి వాళ్లు ఫోన్ చేసి కాల్ కట్ చేశారు. తర్వాత ఫోన్ చేసి ఏం జరిగిందో చెప్పండి అని ప్రశ్నిస్తే.. ఆసుపత్రికి రమ్మన్నారు. మీ కూతురు ఆత్మహత్య చేసుకుందని అక్కడున్న ఓ అసిస్టెంట్ మాతో చెప్పింది. విషయం తెలిసిన వెంటనే మేము అక్కడకు వెళ్లాం. మమ్మల్ని హాలులోకి వెళ్లేందుకు అనుమతించలేదు. తీరా 3గంటలకు లోనికి పంపారు. నా కుమార్తెను చూసి కుంగిపోయా. కేవలం ఒక్క చిన్న వస్త్రం మాత్రమే తన శరీరంపై ఉంది. చేతులు విరిగిపోయాయి. కళ్లు, నోటి నుంచి రక్తం వస్తోంది. నా కూతురిని చూడగానే ఎవరో హత్య చేసినట్లు అనిపించింది. నా కుమార్తె ఆత్మహత్య చేసుకోలేదు ఎవరో చంపేశారు అని అక్కడున్న వారితో అప్పుడే చెప్పా. నా కూతురును డాక్టర్‌ను చేయడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం. చివరకి ఆమెను ఇలా హత్య చేశారు" అని ఆమె మీడియాతో తన బాధను పంచుకున్నారు.

**మమతా బెనర్జీపై విశ్వాసం పోయింది**

తమ కుమార్తె విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని, దీంతో సీఎం మమతా బెనర్జీపై విశ్వాసం పోయిందని బాధితురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇంతకు ముందు బెంగాల్ ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం ఉండేదని కానీ ఇప్పుడు లేదన్నారు. న్యాయం జరగాలని మమతా చెబుతోంది.. కానీ దాని కోసం ఆమె ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. తన కుమార్తె డైరీలోని ఒక పేజీని సీబీఐకి అందజేసినట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేస్తామని మమతా బెనర్జి చెప్పారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగస్టు 20న ఈ కేసును విచారించనుంది.

# సామాన్యుల జీవన గమనం

కళ్ళు విప్పుకొని ప్రపంచాన్ని చూస్తారు. ఏం జరుగుతుందో గమనిస్తారు. పరిశీలిస్తారు. పరిశోధిస్తారు. కొందరు చూసిన విషయాన్ని మర్చిపోతుంటారు. ఇంకొందరు మనకెందుకులే అని నిర్లక్ష్యంగా వదిలేస్తారు. కొందరు సమస్యల మీద సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తారు. ఇంకొందరు ఉపన్యాసాల ద్వారా సమాజాన్ని జాగృతం చేస్తారు. ఇంకొందరు రచనల ద్వారా సమాజానికి విన్నవిస్తారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గంలో పయనిస్తారు.

కానీ బి ఎస్ రాములు సార్ అలా కాదు. ప్రజల సమస్యల మీద ఉద్యమాలు చేశారు. అనేక సభలలో ఉపన్యాసాలు ఇచ్చారు. ప్రజా సమస్యలన్నిటిని రచనల ద్వారా సమాజం ముందు ఉంచుతున్నారు.

"ఒంటరి పోరాటం కన్నా పది మంది కలసి చేసే పోరాటం విజయం సాధిస్తుంది." అంటారు 'చూపు' నవలలో.

బి ఎస్ రాములు సార్ సాహిత్యాన్ని జీవితాన్ని సమీక్షించాలంటే ప్రపంచ చరిత్రను, ప్రపంచ సాహిత్యాన్ని సమీక్షించాలి.

బి ఎస్ రాములు స్వీయ చరిత్ర "ఒక సామాన్యుని జీవన గమనం" పేరుతో రెండు సంపుటాలు వేశారు. ఒక్కొక్కటి ఆరు వందల పేజీలకు పైన ఉంది. మొదటి సంపుటం బాల్యం-ప్రయోగం, రెండవ సంపుటం ఉద్యోగం - ఉద్యమాలు.

తన గురించి తాను రాసుకుంటే అది స్వీయ చరిత్ర. తన గురించి ఇతరులు రాస్తే అది జీవిత చరిత్ర. బి ఎస్ రాములు సార్ గారి ఒక సామాన్యుని జీవన గమనం చదివితే స్వీయ చరిత్రతో పాటు అనేక మంది జీవిత చరిత్రలు కనిపిస్తాయి. భారత దేశ ప్రధాని పి వి నరసింహారావు లాంటి ఉద్దండులైనా వారితో పాటు చదువుకున్నప్పుడు క్లాస్ మేట్స్, రూమ్ మేట్స్, ఉపాధ్యాయులు, బంధువులతో పాటు ఎంతో మంది సామాన్యుల జీవన గమనాన్ని వివరించిన తీరు అద్భుతం అనిపించినా కొందరి జీవితాలు చదివితే హృదయం బరువెక్కుతుంది.

### చదువు

జీవితంలో కొన్ని ప్రభావాలు బలంగా కొనసాగుతాయి. బాల్యంలో వేసిన ప్రభావాలు బలమైనవి. బి ఎస్ రాములు సార్ ఆరో తరగతిలో ఉన్నప్పుడు రాజనర్సయ్య సార్ చెప్పిన విషయాలు రాములు సార్ ను జీవితమంతా నడిపించాయి. "బాగా చదువుకునే వాళ్ల వైపు తల ఎత్తి చూసి అలా చదువుకోవాలి. బాగా చదువుకునే వారిని ఆదర్శంగా తీసుకోవాలి. వారిని గౌరవించాలి. బట్టలు చిరిగినా సరే శుభ్రంగా ఉతుక్కుని వేసుకోవాలి. ఇంట్లో అమ్మ నాన్న చెప్పే పనులు చక్కగా చేయాలి. దీపం వెలుతురులో చక్కగా చదువుకోవాలి. " అని చెప్పేవారు.

ఈ మాటలు బి ఎస్ రాములు సార్ జీవితంపై ప్రభావాన్ని చూపాయి. భవిష్యత్తులో తానేం చేయాలో ఒక నిర్ణయానికి వచ్చాడు బి ఎస్ రాములు సార్. కసితో చదవడం ప్రారంభించారు. ఇక్కడ బి ఎస్ రాములు సార్ చదువు గురించి పేదల గురించి ఆయన ఇచ్చిన విశ్లేషణ పేదల జీవన గమనంపై జీవితమంతా మార్గ దర్శనము చేస్తుంది.

### అమ్మ

అమ్మ ఒక మదర్ తెరిస్సా. మదర్ తెరిస్సా అన్నార్తుల ఆకలి తీర్చిన మదర్. మాక్సిమ్ గోర్కీ గారి అమ్మ దోపిడీ మీద, అణచి వేత మీద ఎలా తిరుగుబాటు చేయాలో నేర్పించిన అమ్మ. సామ్రాజ్యవాదం పై విప్లవాన్ని ఎలా తేవాలో నేర్పించిన అమ్మ. మరి బి ఎస్ రాములు సార్ గారి అమ్మ ? అమ్మలో మాక్సిమ్ గోర్కీ గారి అమ్మను చూడవచ్చు. మదర్ తెరిస్సాను చూడవచ్చు. అమ్మ జీవితమే ఒక పోరాటం. అమ్మ జీవితమే ఒక విప్లవం. అమ్మ జీవితం కష్టాల జీవితం. అమ్మకు ఇరువయి ఐదేళ్ల వయస్సులో నాన్న చనిపోయారు. నాన్న ఇంటి వద్ద బట్టలు నేస్తుండేవారు. కూడు పెట్టని కులవృత్తిని వదలి బొంబాయి వెళ్లి బట్టల మిల్లు కార్మికునిగా చేరాడు. నాన్న చనిపోవడంతో అమ్మకు రెండో పెళ్లి చేయాలని ప్రయత్నాలు చేశారు.

అమ్మ మళ్లీ పెళ్ళి చేసుకుంటే? సవతి తండ్రి పెట్టే చిత్రహింసలు రాములు సార్ మదిలో మెదిలాయి. సవతి తండ్రి గురించిన ఆలోచన భవిష్యత్తు జీవితంపై కలవర పెట్టిస్తుంది. ఆందోళన కలిగిస్తుంది. భవిష్యత్తు జీవితం భయ పెడుతుంది.

అమ్మ త్యాగజీవి. అమ్మ ఆశాజీవి. బాగా చదువుకొని అప్సర్ లు కావాలని అమ్మ చెప్పేది. దీపం వెలుతురులో బి ఎస్ రాములు సార్ చదువు సాగేది.

బడిలో బేతి శ్రీరాములు అని రికార్డుల్లో నమోదు చేశారు. అమ్మమ్మ ఇంటి పేరు బేతి. ఇది మాతృస్వామ్య వ్యవస్థను బలపరిచే ఆలోచన. పితృస్వామ్యంలో వ్యవస్థలో కాకుండా మాతృస్వామ్య వ్యవస్థలో పెరిగిన బి ఎస్ రాములు సార్ గారి జీవన గమనం అనేక మలుపులు తిరుగుతూ పోతుంది.

జగిత్యాలకు స్విమ్మింగ్ పూల్ గా పిలువబడే చెరువులు రెండు ఉన్నాయి. ఒకటి మోతె చెరువు, రెండవది కండ్లపెల్లి చెరువు. ఆ చెరువుల్లో స్నానం చెయ్యడం కొందరికి ఒక అనుభూతి అయితే మరికొందరికి ఇంటివద్ద నీటి సమస్య ఎలా ఉందో వివరించారు.ఇలా జగిత్యాల దాని చుట్టు పక్కల గ్రామాల చరిత్రను, ప్రజల జీవన గమనాన్ని వివరించారు. జగిత్యాల ఎప్పుడు నిర్మాణం జరిగిందో వివరిస్తూ దాని చరిత్రను వివరించారు. జగిత్యాల ఖిల్లా నిర్మాణం దాని చరిత్రను వివరించారు. జగిత్యాల ధర్మపురి మద్య యుద్ధ ట్యాంకులు నడిచిన రహదారి రోడ్డు గా ఏర్పడిందని, జగిత్యాలకు 1969 లో కరెంట్ వచ్చినప్పటి పరిస్థితి, కరెంట్ రాకముందు జగిత్యాల పరిస్థితి ఎలా ఉండేదో వివరించారు.

పెండ్లీలన్ని పెద్ద వాళ్ల నిర్ణయం ప్రకారం జరిగేవి. అబ్బాయి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మొదట చూసేవారు. ఆర్థిక పరిస్థితి బాగుందనిపిస్తే నడవడిక, గుణ గణాల గురించి ఆలోచించేవారు. జగిత్యాలకు తూర్పు వైపు నాలుగు కిలోమీటర్ల దూరంలో జాప్తపురం అనే ఊరు ఉంది. ఆ ఊల్లో ఉండే అంకం మల్లయ్య అనే వ్యక్తి బి ఎస్ రాములు సార్ కు మేనమామ. అంకం మల్లయ్య కూతురు సరస్వతి బి ఎస్ రాములు సార్ కు మేనమర్దలు. ఇద్దరు చిన్న తనంలో కలసి ఆడుకున్నారు. కొంతకాలం తరువాత అమ్మ పెళ్ళి ప్రస్తావన తెచ్చింది.

"మామ పిల్లను ఇవ్వడానికి నిరాకరించాడు. ఇంటి ముందు స్థలం లేదు. ఇంటి వెనుక పొలం లేదు. నా బిడ్డను ఎట్లా అడుగుతున్నావే అంటూ కోపానికి వచ్చిండు. ఆ తిట్లతో అమ్మ జాప్తపురం నుంచి ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. " ఆ కాలంలో వ్యవసాయానికి ప్రాధాన్యం ఉండేది. బి ఎస్ రాములు సార్ కు వ్యవసాయ భూములు లేవు ఆస్తులు కూడా లేవు. అలా మేనరికం సంబంధం ఇచ్చుక పోయింది. దాంతో పైకి రావాలనే కసి పట్టుదల రాములు సార్ కు మరింత పెరిగింది.

### స్వదేశంలో కాందిశీకులు

స్వదేశంలో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు లేదా స్వదేశంలో ఉపాధి లేక ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి స్థిర పడే వారిని కాందిశీకులు అంటారు. అలా వెళ్లిన వారు ఎదుర్కొనే అసమానతలు లెక్కలేనన్ని ఉంటాయని అందరికి తెలిసిన విషయమే.

కానీ స్వదేశంలోనే కాందిశీకులుగా బతుకుతున్న వారి బాధలను, అసమానతలను బి ఎస్ రాములు సార్ చక్కగా వివరంగా వివరించారు.

బి ఎస్ రాములు సార్ ఎలగందుల లో హాస్టల్ వార్డెన్ గా ఉద్యోగంలో చేరాడు. ఎలగందుల మానేరు నదికి సమీపంలో ఉంది. ఎలగందుల ఒక చారిత్రక ప్రదేశం. రాజులకు, రాజ్యాలకు పరిపాలన కేంద్రంగా విలసిల్లింది. 1905 వరకు కొనసాగిన జిల్లా కేంద్రాన్ని కరీంనగర్ కు మార్చారు. లోయర్ మానేరు డ్యాం (%బావీణ%) కరీంనగర్ పక్కన అలుగునూర్, కరీంనగర్ మద్య నిర్మించారు. ఎల్ ఎమ్ డి ప్రాజెక్టు లో పదకొండు గ్రామాలు మునిగి పోయాయి. ఎలగందుల కూడా సగం మునిగి పోయింది. ఎలగందుల ఒక శిథిల గ్రామంగా మిగిలి పోయింది. ఎంతో మంది నిరాశ్రయులు అయ్యారు. వేలాది మంది తమ గ్రామాల మీద హక్కులను కోల్పోయారు. తమ ఇండ్లను కోల్పోయారు. కులవృత్తులను కోల్పోయారు రైతులు భూములను కోల్పోయారు. నిర్వాసితులకు ఇచ్చిన పరిహారం ఏ మూలకు సరిపోలేదు. ప్రజలు కొత్త ప్రాంతం, కొత్త జీవితం వెతుక్కుంటూ నిరాశ్రాయలుగా ఇతర గ్రామాలకు వలస వెళ్ళినప్పుడు బయట ప్రాంతం నుంచి బతుకవచ్చిన వారిగా ముద్ర వేస్తారు. పని దొరకదు. చీదరింపులు, అసమానతలను ఎదుర్కొంటూ స్వదేశంలో కాందిశీకులుగా బతుకుతున్న ఎంతో మంది ప్రజల జీవన గమనాన్ని, ప్రజల ఆర్తనాదాన్ని బి ఎస్ రాములు సార్ వివరించారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని వివరించారు.

హాస్టల్ లో వంటమనషి బొగ్గుల కోసం కక్కుర్తి పడడం ఆశక్తి కలిగిస్తుంది.

### వైతాళికుడు

ఒక సామాన్యుని జీవన గమనం చదివితే రాములు సార్ ఒక వైతాళికుడుగా దర్శనమిస్తాడు. 1969 లో వచ్చిన జై తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని మర్రి చెన్నారెడ్డి నిర్వీర్యం చేశారనే ఆరోపణలకు వివరణ కనిపిస్తుంది.

మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాలుగో తరగతి ఉద్యోగులను తొలగించాలనే ప్రతి పాదన వచ్చింది. దాంతో ముఖ్యమంత్రిని కలసి "అటెండర్ల వ్యవస్థను తొలగిస్తే అట్టడుగు వర్గాల నుండి తొలి తరం విద్యావంతులు ఎదగడం ఆగిపోతుంది. ప్రభుత్వం లాభనష్టాలతో కాకుండా, కర్చులను తగ్గించడం అనే పద్ధతిలో కాకుండా, ప్రజల సంక్షేమం కోసం, ఉపాధి కోసం కూడా ఆలోచించాలి. అటెండర్లకు ఉద్యోగం ఇవ్వడం అనేది కూడా ఒక సంక్షేమం. సామాజిక అభివృద్ధిలో బాగంగా భావించాలి. "

ఎన్ జి వో ల విన్నపం విన్న ముఖ్యమంత్రి అటెండర్ల వ్యవస్థను తొలగింపుకు సంబంధించిన జి వో ను రద్దు చేశారు.

బి ఎస్ రాములు సార్ ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు ఉద్యోగ సంఘాల నిర్మాణానికి కృషి చేస్తు, జన చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు.

దాంతో ప్రభుత్వానికి కోపం వచ్చింది. ఎలాగైనా ఇరికించాలని జిల్లా అధికారులు ఎదిరి చూశారు. జిల్లా అధికారులకు చెప్పకుండా విద్యార్థులను పిక్నిక్ కు తీసుకవెళ్లారు. జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. బి ఎస్ రాములు సార్ జవాబు ఇచ్చారు. అయినా కూడా కావాలని సస్పెండ్ చేశారు.

సస్పెన్షన్ ఎత్తి వేతకు ప్రయత్నాలు చేశారు. కానీ సాధ్యం కాలేదు.

పూర్తి సమయం ఉద్యమానికి కేటాయించారు. విద్యార్థి సంఘాల నిర్మాణానికి సహకరిండం, వారికి శిక్షణ తరగతులు నిర్వహించడం, మానవ హక్కుల విధ్వంసంపై ఉపన్యాసాలు ఇవ్వడం, మానవ హక్కుల విధ్వంసంపై పుస్తకాలు రాయడం, విరసం కార్యక్రమాలలో పాల్గొనడం, ఆర్ ఎస్ ఎస్ శిక్షణా కార్యక్రమాలలో ముఖ్య శిక్షక్ గా వెల్లడం. ఈ కాలంలో వెలువరించిన బతుకుపోరు నవల అత్యంత ప్రసిద్ధి పొందిన రచనగా గుర్తింపు పొందింది.

హుజూరాబాద్ లో హాస్టల్ వార్డెన్ గా ప్రభుత్వం మళ్లీ పోస్టింగ్ ఇచ్చింది.

అప్పటినుండి ఉద్యోగం చేస్తూనే ఉద్యమాలు, సాహిత్యం, సాహిత్య సమావేశాలు లెక్కలేనన్ని నిర్వహించారు. ఈ క్రమంలో రెండు సార్లు జైలుకు వెళ్ళడం చూస్తే ఆయన ఎంత ధైర్యవంతుడో తెలుస్తుంది. వందకు పైగా పుస్తకాలు వెలువరించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి బి సి కమీషన్ చైర్మన్ గా నియామకం అంటే మాములు విషయం కాదు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనడానికి బి ఎస్ రాములు సార్ ఒక ఉదాహరణ.

నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్
ప్రముఖ రచయిత
9989142403

# "రాఖీ ప్రాశస్త్యం:





రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

హయగ్రీవ జయంతి"గా జంధ్యాల,","రాఖీ", "నార్లీ" పూర్ణిమగా పేరెన్నిక గన్న శ్రావణ పౌర్ణమి సర్వజనులకు పర్వదినం. ఉపవాసాలకు ఉద్దిష్టమైన పండుగ కాక, హిందువులలో అన్ని తరగతుల వారూ నిర్వహించుకునే పర్వం ఇది. వర్షాకాలపు రాకకు సంతసిస్తూ, మధుర పదార్థాలు భుజించడం అనుసరణీయమైన ఆచారం. వరుణ దేవుని కరుణకోసం కొబ్బరి కాయలు సమర్పించడం చేత 'నార్లీ' లేదా 'నారికేళ పూర్ణమి అని మరో పేరుంది. దక్షిణ భారతావనిలో శ్రావణ పూర్ణిమ 'పౌతి పౌర్ణమి అంటారు. ఆ రోజున విష్ణు, శివ, గణేశులను పూజిస్తారు. ముంబాయి ప్రాంతంలో నార్లీ పూర్ణిమ అనబడే ఈ దినం నాడు వరుణుని కరుణ కోసం సముద్రుని పూజించే ఆచారం ఉంది. ఆ రోజులలో సముద్రం ప్రశాంతంగాఉంటుందని



నమ్మకం. కనుక పూర్వకాలంలో సముద్రాంతర వర్తకానికి ఈ రోజునే ప్రారంభించే వారు. తిరిగి రావడానికి ఈరోజు ఎంచుకునే వారు. యజ్ఞోపవీతాలు, నారికేళం శ్రావణ పూర్ణిమ నాడే సముద్రంలో పడవేసేవారు. పూర్వకాలంలో శ్రావణ పూర్ణిమ నాడు ఉపాకర్మానంతరం వేదవిద్య ప్రారంభించడం జరిగేది. ఉపా కర్మ పండుగకాక అధ్యయయానికి సంబంధించిన కర్మ. ఉప నయనమనగా అదనపు కన్ను.
గురువు తన ప్రజా ప్రాభవం చేత వటువునకు జ్ఞాన నేత్రమును తెరిపించడమన్నది పరమార్థం.
యజ్ఞం, ఉపవీతంతో కలిస్తే యజ్ఞోపవీతం. ఉప వీతమంటే దారము. యాగకర్మచేత పునీతమై మూడు పోచల దారం. సృష్టి స్థితి, లయకారులైన త్రిమూర్తులను సూచించేవి ఒక్కో ముడిలోని మూడు తాళ్ళు. జంద్యాల పౌర్ణమి నాడు చేయు కర్మనే ఉపాకర్మ. మాతా పితరుల వల్ల ఏర్పడేది ప్రథమ జన్మకాగా, మౌంజీ బంధనం వల్ల ఏర్పడునది ద్వితీయ జన్మ అయినందుకే ద్విజులు" పేరు. శ్రావణి పర్వాన్ని ద్విజులు వేద శాఖలకు చెందిన రుషుల అనుగ్రహానికై రుషి పూజ, రుషి తర్పణాలు చేస్తారు. శతపథ బ్రాహ్మణ ప్రకారం "గౌతమ, భరద్వాజ, విశ్వా మిత్ర, జమదగ్ని, వశిష్ఠ, కశ్యప, అత్రి"ని సప్త ఋషులు అంటారు. అయితే "మరీచి, అత్రి, అంగీ రస, పులహ, క్రతు, పులస్త్య, వసిష్ఠులను" సప్త రుషులుగా మహాభారతం చెపుతున్నది. వేదకాండర్షుల అనుగ్రహం ఉపాకర్మానుష్టానం చేయడం వల్ల కలుగుతుంది. సంవత్సర పాప నాశనానికి విరజాహోమం చేస్తారు. "శ్రౌత స్మార్త నిత్య నైమిత్తిక కామ్య కర్మానుష్టాన యోగ్యతా సిద్ధ్యత్తం యజ్ఞోపవీత దారణం" నిర్దేశితమైనది. వేదశాస్త్ర పురాణేతిహాసాది సమస్త వ్మాయార్థం పితృ తర్మణం, బ్రహ్మయజ్ఞం చేస్తారు. ఉపాకర్మకు యజుర్వేదులకు పూర్ణిమ తిథి, రుగ్వేదులకు శ్రవణ నక్షత్రం, సామవేదులకు హస్తా నక్షత్రం ప్రధానాలు. శ్రావణంలో ఉపాకర్మ కారణాంతరాలవల్ల చేయలేకపోతే ఆషాఢ లేదా భాద్రపద పౌర్ణమి నాడు చేస్తారు.

### రాఖీ పౌర్ణమి ప్రాశస్త్యం

సర్వరోగ ఉపశమనం, సర్వాశుభ వినాశనం కోసం ధర్మజుడు శ్రీకృష్ణుడిని ఉపాయం అడుగగా, రక్షాబంధన విధి ఉపదేశించినట్లు, దేవాసుర యుద్ధంలో ఇంద్రుని, ఇంద్రాణి రక్షాబంధనం చేసి, విజయం సాధింప చేసినట్లు శ్రీకృష్ణుడు వివరించిన సందర్భం పురాణ కథనం. రక్షాబంధనం భార్య, భర్తకు కట్టాలని ఉన్నా, ఆచరణలో సోదరియో, కూతురో కట్టే ఆచారాన్ని వ్రతోత్సవ చంద్రిక వివరిస్తున్నది. శ్రావణ పూర్ణిమ రాఖీ పూర్ణిమ. రాఖీ అంటే తోరము, తోరం పట్టు దారంతో లేదా నూలుదారంతో చేయబడుతుంది. రాఖీ అనేది ఒక ఆభరణం లాంటిది. రంగుదారంతో లేదా కాగితంతో చేసి, దానికి తోరం జోడించి, దానిని సోదరి సోదరుని ముంజేతికి కట్టడం సాంప్రదాయం. బొట్టుపెట్టి హారతినివ్వడం, సోదరుడు, సోదరికి కట్నకాను కలు సమర్పించడం ఆచారం. రాఖీ ప్రాధాన్యతను బట్టి ఒక స్త్రీ, పురుషునికి రాఖీ పంపి లేదా కట్టి ఆతని రక్ష కోరే ఆచారం ఏర్పడింది. దానిని అందుకోవడంతోనే ఆతడు ఆమెకు సోదరుడైరక్షకుడవుతాడని భావన.

# ఆధ్యాత్మిక ప్రతిపత్తిలో విశ్వ గురువు భారత్

విశ్వ ఆధ్యాత్మిక సమ్మేళనమహోత్సవం 2024. హైదరాబాద్ నగరంలో జరగడం మహదానందకరం. భారతదేశ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవం ప్రపంచానికి స్ఫూర్తిదాయకం కావడానికి ఇది ఒక మంచి అవకాశం అనుకున్నాను. 1893లో చికాగో నగరంలో జరిగిన విశ్వ మత సమ్మేళనంలో సర్వమతాలను సమన్వయం చేస్తూ స్వామి వివేకానందుల వారి వాణి వినపడినట్లే, ఇన్ని ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక విశ్వ సమ్మేళనంలో మరొక మారు వివేకానందుని స్ఫూర్తిదాయకమైన వివేక వాణిని ఒక్కరైనా వినిపిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అనుకున్నాను. ఎవరి సోది వారిదే అయిందిగానీ ప్రపంచప్రయోజనాన్ని కోరే యెటువంటి శాంతికాముక ప్రయత్నము జరగలేదు.

నేడు మతాల మధ్యన జరుగుతున్న విద్వేషాగ్నిలో మనిషి ఛిద్రమైపోతున్నాడు. దేవుని ఒక వ్యక్తిగా మలుచుకొని మహిమ పరచుకోవడం వల్లనే మతాలవారీగా దేవునికి ఎన్ని పేర్లైనా పెట్టుకోడానికి వీలు కుదిరి, పేరుపేరునా మానవ సమాజం మత సమాజాలుగా వేరు పడిపోయింది. ప్రపంచ ప్రజ్ఞానం మూలాల్లోకి ఆలోచింపలేని వారు కేవలం విశ్వాసకులుగా ఉంటూ వ్యక్తిరూప దేవుని సృష్టికర్తగా తమ ఊహల్లో నడిపించుకుంటూ మతానికి మతానికి మధ్యన దేవుని సామర్థ్యాలలో తేడాలు చూపించుకుంటూ విజ్ఞత కోల్పోయి విమర్శించుకుంటున్నారు. దేవుడు మతాల మధ్య భంగపడిపోతున్నాడు. ఆస్తికవాదంతో అన్ని మతాలు ఆడుకుంటున్నాయి. ఆస్తిక వాదం భ్రష్టుపట్టిపోయింది.

సమస్య మూలాలను తాకే సరైన సత్య నిరూపణ కోసం అవసరమైన నిజతర్కాన్ని నిగుడింప చేయాలంటే, ఇప్పుడున్న తప్పుడు అభిప్రాయాలను మూఢనమ్మకాలను పారద్రోలగలిగే అసలైన ఆధ్యాత్మిక న్యాయానికి పునర్మూల్యాంకనం చేసుకోవాల్సి ఉంది. అందుకు ఇటువంటి విశ్వమత సమ్మేళనాలు దోహదం చేయాలి. శాస్త్రీయంగా సంతృప్తినిచ్చే తాత్వి క ఆలోచన అభివృద్ధి చెందాలంటే, భ్రమలు లేనట్టి ఖచ్చితమైన విచారం రూపుదిద్దుకోవాలి. వస్తు గతమైన విశేషమే వాస్తవము. మనకు వాస్తవం కావాలి. కల్పితం కాదు. ప్రపంచం ఒక సద్వస్తువు. దీనికి సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలు, దీని ఆవిర్భావానికి గల కారణం ఉద్దేశము మొదలైనవన్నీ మస్తు పరంగానే ఆలోచించి అధ్యయనం చేయాలి. విశ్వాన్ని దృష్టిలో పెట్టుకొని వస్తుగతంగా పరిశీలించినప్పుడే అన్ని మతాలు శాస్త్రీయమైన దృక్కోణం అనవరసుకొని ఆలోచిస్తాయి. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక ఆలంబనలో ఎటుపడితే అటు పోకుండా, మతాతీతంగా ఆలోచించి సరైన త్రోవలో నడవడానికి సదవగాహన కలిగించుకోవాలి. మేధావులు తర్కాన్నే ఆశ్రయిస్తారు. మతాన్ని కాదు. మానవ లోకానికి వకింత మేలు జరగాలంటే పిడి వాదాలు మానుకొని నిజాలను అంగీకరించాలి. ఏ కూతస్థ ప్రజ్ఞానము ప్రపంచంగా ఎందుకు ఏ ఉద్దేశముతో కనిపిస్తున్నదో, దానిలో మనిషి భాగస్వామ్యం ఏమిటో చెప్పకుండా కేవలం మత సాంప్రదాయ నమ్మకాలను వొక్కాణిస్తే ప్రయోజనం లేదు.

సృష్టికర్త ఒకడున్నాడనే ప్రతిపాదన భారతీయ సనాతన సాహిత్యంలో లేనే లేదు. మొదటగా ప్రకృతి సర్వస్వమనుకొని ప్రారంభమైన ప్రాకృతికమైన ఆలోచన, ఆ తర్వాత ప్రకృతికి కారణభూతంగా ప్రజ్ఞానమొకటుందనే విధంగా స్థిరపడింది. మతబేదాలు నశించాలంటే ప్రజ్ఞాన సిద్ధాంతం ఒక్కటే ఇప్పుడు కావాల్సింది. ప్రజ్ఞాన వైభవాన్ని భారతీయ ఆధ్యాత్మిక ప్రజ్ఞ మాత్రమే, ఉపనిషత్తులు మాత్రమే ప్రవచించగలుగుతాయి. ప్రపంచ దేశాలకు భారతదేశం దివ్యమైన ఆధ్యాత్మిక దృష్టి కలిగిన దేశంగా గురు స్థానం వహించాలంటే శంకరాచార్యుని అద్వైత వాద సాహిత్యాన్ని ముందుకు తీసుకురావాలి.

ఆస్తిక వాదానికి అద్వైత వాదానికి ఎప్పుడూ పొత్తు కుదరదు. జ్ఞాన విషయములో గాని, మోక్ష విషయంలో గానీ రెండిటికీ సామ్యం లేదు. ఆస్తిక భావం, వ్యక్తి రూపంలో భగవంతుని ఊహించుకొని, ఒక పేరు పెట్టి నామస్మరణతో ఉంటేనే ఈ లోకంలో సుఖంగా ఉండటానికి, మరణం తర్వాత పరలోకంలో దేవుని సన్నిధిలో ఉండిపోయి సుఖాలు పొందడానికి కుదురుతుందని కుదుర్చుకున్న నమ్మకం. ఈ నమ్మకంలో ఎప్పుడూ దేవుడు దేవుడిగానే,జీవుడు జీవుడిగానే ఉంటారు. శరణాగతి ఉంటే తప్ప దేవుడి లోకంలోకి ప్రవేశం లేదు. తాను విశ్వసించిన దేవుడు తనకోసం అతని లోకంలో తివాచీ పరిచి ఉంటాడని ప్రతిమతస్తుడు నమ్ముతాడు. ఎటువంటి చిన్న సుఖం కావాలన్నా మొరపెట్టుకునే దీనత్వం ఆస్తిక వాదములో ఉంది. ఆశ్రయించిన వారికే రక్షణ ఉంటుందని దేవుడుంటే దేవుడికి రాజకీయ నాయకుడికి తేడా ఉండదు. నేను నేనే, నీవు నీవే. నీవె వ్వుడు నా కాళ్ళ దగ్గర పడుండాల్సిందేనని దేవుడుంటే అన్యాయమే అవుతుంది. కానీ ఆధ్యాత్మిక జ్ఞానమార్గం అలాంటిది కాదు. ఆధ్యాత్మిక జ్ఞాన మార్గంలో న్యాయానికే అగ్ర తాంబూ లం. న్యాయమనేది సృష్టికి సంబంధించిన ప్రజ్ఞాన సత్యం. ఈ న్యాయ స్పృహనే పరమాత్మగా వ్యవహరిస్తాము.ఆధ్యాత్మిక వాదంలో తన్ను తాను పరచుకున్న తివాచీ లాంటిది పరమాత్మ. ఏకమేవాద్వితీయం. ఉన్నది ఒకటే ఇన్ని రూపాలలో కనిపిస్తున్నది. ఎందుకు? ప్రపంచంలో పరిణామాలు, అవస్థలు,రూపాలు ఇవన్నీ ప్రేమ తత్వాన్ని, పరస్పరసహ కారాన్ని, పంచడానికి ఏర్పడిన పరస్పరాశ్రిత విశేషాలుగా ఉంటున్నాయి. ఈ విషయం అర్థం చేసుకుంటేనే, అప్పుడే సాకారంగా ఉన్న ప్రపంచం ప్రకాశపరచుకున్న ప్రజ్ఞాన స్వరూపంగా మన ఆలోచనలకు అందుతుంది. పరమాత్మ ప్రపంచంగా ఎంత వ్యాపకంగా ఉందో, ప్రపంచాన్ని ఉపయోగించుకునే జీవాత్మ అంతే వ్యాపకంగా ఉందని, ప్రపంచాన్ని అనుభూతుల మయంగా రస రంజితం చేయడానికి పరమాత్మ జీవాత్మగా అయిందని తెలుసుకోవాల్సి ఉంది. మోక్షం అనేది జీవుడికి సుఖాల లోకము కాదు. జీవ ప్రకాశం ప్రజ్ఞాన ప్రకాశంగా ఎదిగిన స్థితి. సృష్టి మర్మాన్ని అర్థం చేసుకున్న స్థితి. జ్ఞానమే మోక్షమని శంకరాచార్యులు చెప్పింది కూడా ఇదే. చర్చావేదికలు ఏర్పాటు చేసినప్పుడు ముఖ ప్రీతి కోసం తమ పిడివాదాలకు నమ్మకాలకు పరస్పరం వత్తాసు పలుక్కోకుండా" ప్రజ్ఞానం బ్రహ్మ" అనే సార్వత్రిక సత్యాన్ని ఆమోదిస్తూ ఏకాభిప్రాయానికి రాగలిగితేనే, అప్పుడు మాత్రమే విశ్వ మతం ఆవిష్కృతమవుతుంది.

- కె.వి.రమణారెడ్డి
9849280607

## విజ్ డమ్, విద్యా భారతి విద్యాసంస్థలలో
### ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**కొడిమ్యాల ఆగస్టు 16 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలోని విజ్ డమ్, విద్యా భారతి విద్యాసంస్థలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకావిష్కరణ పాఠశాల ప్రిన్సిపల్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు పాఠశాల యాజమాన్యం విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



**ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్షకొండలో "అక్షర భారతి కాన్వెంట్ స్కూల్ " లో ముందస్తు రాఖీ బంధన్ సంబరాలు చేసుకున్న విద్యార్థులు.**

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాఖీ పండుగ సంబరాలు



జగిత్యాల ఆగస్ట్ 18 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నివాసంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి రాఖీ కట్టారు జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కి మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు పిప్పరి అనిత శ్రీనివాస్ రాఖీ కట్టారు. వివిధ హోదాలో ఉన్న మహిళా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సాక్ష్యం చెప్పవద్దని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

**భీమదేవరపల్లి ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** నాపై ఉన్న కేసులో సాక్ష్యం చెప్పవద్దని మండిపడుతూ కోల సుమలత, ఆమె భర్త పోచయ్య తో పాటు కుమారుడు వెంకటేష్ పై గొడ్డలితో దాడి చేసిన గూళ్ళ రాజుపై కేసు నమోదు చేసినట్లు ముల్కనూరు ఎస్సై నంద్రు సాయిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఈ నెల 17వ తేదీన రాత్రి గూళ్ళ రాజు గొడ్డలి పట్టుకొని ఇదే గ్రామానికి చెందిన కోల పోచయ్య ఇంటికి వెళ్ళాడు. నాపై ఉన్న కేసులో సాక్ష్యం చెబితే చంపుతానని బెదిరించాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అనంతరం ఇంటికి వెళ్ళిపోయిన రాజు మళ్ళీ అదే రోజు రాత్రి గొడ్డలి పట్టుకొని పోచయ్య ఇంటికి వెళ్ళాడు. ఇంటి తలుపులను గొడ్డలితో బాదడంతో పోచయ్య వెళ్లి తలుపులు తీశాడు. వెంటనే ఇంట్లోకి చొరబడిన రాజు నిన్ను చంపితే నాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పే పని ఉండదంటూ గొడ్డలితో పోచయ్య పై దాడి చేస్తున్న క్రమంలో అతని కుమారుడు వెంకటేష్ అడ్డుకోవడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. అనంతరం గొడ్డలి కామతో భార్య భర్తలను చితకబాదాడు. కోల సుమలత ఫిర్యాదు మేరకు గూళ్ళ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై నంద్రు సాయిబాబు తెలిపారు.

# సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు నిధులు విడుదల



**సైదాపూర్ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** సైదాపూర్ మండల పర్యటనలో భాగంగా పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ మేరకు నేడు సర్వాయిపేట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుతో పాటు నాలుగు కోట్ల 70 లక్షల రూపాయలతో ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి హుస్నాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి మేరకు టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నిధులు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మరియు గౌడ సోదరుల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంబరాలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ప్రయాణికులకు ఆటో కార్మికులకు మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకోవడం జరిగింది. అనంతరం కార్యక్రమాన్ని నిర్దేశించి జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్ గారు మాట్లాడుతూ ఇచ్చిన మాట కట్టుబడి ఉండే నైజం గల బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ గారి కృషి వల్ల నేడు సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట గ్రామం నాలుగు కోట్ల 70 లక్షల రూపాయల నిధులతో పర్యటకంగా అభివృద్ధి చెందని ఇది ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో రాష్ట్రంలో హుస్నాబాద్ నియోజకవర్గ పర్యాటకంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలలో మొదటి దశలో ఉంటుందని సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నామని పర్యాటక అభివృద్ధి కోసం నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృషి చేసిన పొన్నం ప్రభాకర్ కు కాంగ్రెస్ పార్టీ పక్షాన గౌడ సోదరుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, చొప్పదండి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు పొన్నం శ్రీనివాస్ గౌడ్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెన్న రాజమల్లయ్య, ఎస్ ఎల్ గౌడ్, రామిడి రాజిరెడ్డి, వంగల విద్యాసాగర్, నూనె గోపాల్ రెడ్డి, మాచర్ల అంజయ్య గౌడ్, కలర్ సత్తన్న, కోరుకంటి ఆనంద్, దూలం అంజయ్య గౌడ్, రాజ్ కుమార్ సిరికొండ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో రక్షాబంధన్ వేడుకలు

### "నాకు నీవు రక్ష, నీకు నేను రక్ష, మనమందరం దేశానికి రక్ష"



కోరుట్ల ఆగస్ట్ 18 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థినీ విద్యార్థులు ముందస్తుగా రక్షాబంధన్ లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు, మరియు సహ ఉద్యోగులకు, అక్కడ ఉన్నటువంటి ప్రజలకు కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి రక్షాబంధన్ చేయడం జరిగింది. గవర్నమెంట్ హాస్పిటల్ సందర్శించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు, కోరుట్ల ఎమ్మార్వో ఇటిక్యాల కిషన్ కు, సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, శ్వేత లకు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కు, రిజిస్ట్రేషన్ అధికార్లకు, కోరుట్ల మున్సిపల్ కమిషనర్ కు, మరియు టెలికం, పోస్ట్ ఆఫీస్ అధికారులకు మిగతా అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందికి రక్షాబంధన్ చేయడం జరిగింది. అలాగే శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమానికి ప్రముఖ తెలుగు కవి ఆధ్యాత్మిక పండితుడు పూర్వ విద్యార్థి బట్టు హరికృష్ణ మరియు జగిత్యాల జిల్లా ఆర్ఎస్ఎస్ ప్రచారక్ లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరు అయినారు. వీరిరువురు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.... సనాతన ధర్మ విశిష్టతను మరియు రక్షాబంధన, ప్రాముఖ్యతను, స్నేహపూర్వకమైన బంధాన్ని తెలియజేస్తు, మాతృమూర్తుల బంధాన్ని, అన్నదమ్ముల బంధాన్ని, దేశం యొక్క సమాజసేవ బంధాన్ని మన దేశం బోర్డర్ లో అహర్నిశలు భద్రతతో కాపాడే జవాన్ల గురించి విద్యార్థులకు వివరించారు. భిన్నత్వంలో ఏకత్వం అంటే నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనిద్దరం దేశానికి రక్ష అని తెలియజేశారు. విద్యార్థి దశ నుండి వారికి ఇలాంటి విషయాలు బోధించడం వలన వారికి భవిష్యత్తులో దేశభక్తి పెరిగి, సనాతన ధర్మ మార్గంలో పయనిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత స్థాయిలో ఉండేలా చేస్తుందని తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్ మాట్లాడుతూ..... ప్రతి సంవత్సరం మా సరస్వతీ శిశు మందిర్ లో విద్యార్థిని విద్యార్థులకు రక్షాబంధన్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సోదర భావాన్ని పెంచి మానవతా విలువలను పెంచుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలిగినప్పుడే రాగద్వేషాలకు అవకాశం లేకుండా మనం నివసిస్తున్నటువంటి గ్రామం కావచ్చు, పట్టణం కావచ్చు, రాష్ట్రం కావచ్చు, అభివృద్ధి పథంలో నడవడానికి ప్రతి ఒక్కరి స్నేహపూర్వకమైన బంధమే అభివృద్ధి ముందుకు కొనసాగుతుందని తెలియజేశారు. ముఖ్య అతిథుల ప్రసంగం తర్వాత విద్యార్థిని విద్యార్థులు ఎదురెదురుగా కూర్చుండి నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనిద్దరం దేశానికి రక్ష అనే సందేశాన్ని చెప్పుకొని ఒకరికొకరు రాఖీని కట్టుకొని రక్షాబంధన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు. ముఖ్య అతిథులకు పాఠశాల పక్షాన ప్రధాన ఆచార్యులు గోపు వెంకటేష్ కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్ చిరు సన్మానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు గోపూ వెంకటేష్, లింగారెడ్డి మరియు. అధ్యాపకులు, మాతాజీలు, విద్యార్థులు, ప్రబంధకారిణి మరియు సమితి సభ్యులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి ఆధ్వర్యంలో
## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు





జమ్మికుంట ఆగస్ట్ 18 (ప్రజామంటలు): జమ్మికుంట పట్టణంలో బహుజన ఉద్యమ కారుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది . జమ్మికుంట లో మడిపల్లె పోయే క్రాస్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పువ్వుల మాలలు వేసి కేక్ కట్ చేయడం జరిగింది. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న చిన్ననాటి నుండే పెత్తందారుల పోరు భరించలేక తిరుగుబాటు చేసి 12 మందితో గెరిల్లా సైన్యం మొదలుపెట్టి అందులో అన్ని కులాల నాయకులను తీసుకొని 12వేల గెరిల్లా సైన్యాన్ని తయారుచేసి పోరాటం చేసి విజయం సాధించి గోల్కొండ రాజుగా కొన్ని సంవత్సరాలు పాలించడం జరిగింది తన పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు మంచిగా పాలిస్తున్న తరుణంలో కొంతమంది పెత్తందారులు భూస్వాములు ఒకటే తనపై తిరుగుబాటు చేసి తన ఓడించడం జరిగింది. 300 సంవత్సరాల క్రితమే పోరాటం చేసిన గొప్ప నాయకులు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారు తన ఆశయాలను కొనసాగాలని పిలుపునియ్యడం జరిగింది సర్దార్ సర్వాయి పాపన్న జయంతి కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న జమ్మికుంట మునిసిపల్ ఛైర్మన్ శ్రీ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు గారు. పోన్నగంటి మల్లన్న మాజీ సర్పంచ్%ఒ% కౌన్సిలర్ గౌరవ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారేపల్లి బిక్షపతి, శ్రీపతి నరేష్, పొన్నగంటి సారంగం, దేశిని రాధా సదానందం, దీప్తి కిషన్ రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించిన గౌడ పెద్దలు ఆరెల్లి మల్ల గౌడ్ ప్రభాకర్ గౌడ్, రాజు గౌడ్, నాగపురి రమేష్ గౌడ్, విజయ్ గౌడ్, కృష్ణ గౌడ్, ఈ కార్యక్రమంలో నాయకులు పూదరి రేణుక శివ గౌడ్, మల్లారెడ్డి, మధు, రామ్మూర్తి గౌడ్, బొంగోని సదానందం గౌడ్, బుర్ర సంపత్ గౌడ్, అజయ్ గౌడ్, పంజాల అనిల్ గౌడ్, గౌడ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.



**జగిత్యాల శాతవాహన యు.పి.ఎస్., వాణీ నగర్ స్కూల్లో జరిగిన ముందస్తు రాఖీ పండుగ వేడుకలు. పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు.**



**జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నెల్లుట్ల శ్రీనివాస్ నగర్ కాలనీలో నెల్లుట్ల రవీందర్ రావు సారథ్యంలో జరిగిన నెల్లుట్ల పౌండేషన్ 5 వార్షికోత్సవం సందర్భంగా జనగామకు చెందిన కవయిత్రి బుదారపు లావణ్యకు సన్మానం.**

# జగిత్యాల జర్నలిస్టుల జైత్రయాత్ర.

## జో వాదా కియా వో నిభాన పడేగా

### ప్రజా సంఘాల సంఘీభావమే జర్నలిస్టుల ఉద్యమానికి స్ఫూర్తి





**జగిత్యాల జర్నలిస్టుల జైత్రయాత్ర.**

జో వాదా కియా వో నిభాన పడేగా

ప్రజా సంఘాల సంఘీభావమే జర్నలిస్టుల ఉద్యమానికి స్ఫూర్తి

ఎట్టకేలకు ప్రజా ప్రతినిధుల సమన్వయమే సమస్యకు పరిష్కారం సమాజంలో ఎవరికి సమస్య వచ్చిన జర్నలిస్టులు మాత్రమే ఆ సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిల కొనసాగే జర్నలిస్టుకు సమస్య వస్తే ఎవరు తీరుస్తారు అన్న డాలర్ల ప్రశ్నకు ప్రతిరూపమే దీక్షలు తప్ప ఏ ఒక్క ప్రజాప్రతినిధికి తమ దీక్షలు వ్యతిరేకం కాదని కేవలము కొద్దిపాటి మిగిలిన ప్రభుత్వ భూమి తమకు ఎక్కడ అందకుండా పోతుందో అన్న భావనతో దీక్షలకు దిగామని మొదట్నుండి జర్నలిస్టులు అంటున్న మాటలే .మొదట్లో జర్నలిస్టుల సమస్యను అందరు ప్రజా ప్రతినిధులు తీవ్రంగా తీసుకోలేదు. ప్రజా సంఘాలు, అన్ని వర్గాల వారి సంఘీభావంతో జర్నలిస్టుల దీక్షలు పూర్తిస్థాయిలో న్యాయబద్ధమైనవే అనే భావన ఏర్పడి ఎట్టకేలకు సమస్య పరిష్కరించి జర్నలిస్టులను ఓ ఇంటి వారిని చేయాలన్న కలను తీర్చే దిశగా స్థానిక శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ చీఫ్ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సమన్వయంతో సమస్య పరిష్కార దిశగా అడుగులు వేసి ఎట్టకేలకు దీక్షలను విరమింప చేశారు. ఉద్యమాల్లో ఎత్తు పల్లాలు ఉంటాయని దానికి ఉదాహరణ తెలంగాణ ఉద్యమమేనని తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న జర్నలిస్టులకు తెలియంది కాదు. అందుకే ప్రజాప్రతినిధులపై పూర్తి భరోసాతో దీక్షను విరమించారు. నేటికీ జర్నలిస్టులు జగిత్యాల రోడ్డు మీదికి వచ్చి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఉద్యమం 15 రోజులు కొనసాగింది . వారిపై కనీస కనికరం లేదా ??? ఇంకా ఎన్ని రోజులు రోడ్ల పై ఉంటే వారికి పిడికెడు భూమి అందుతుంది ???

ఇప్పటివరకు జర్నలిస్టుల సంక్షేమం వచ్చేసరికి గత బారాస పార్టీ, నేటి కాంగ్రెస్ పార్టీ ఏమి తీసిపోయేలా లేవు !!!

అని పలువురు విపక్ష నేత లు, పలువురు జర్నలిస్టులు అనుకున్నప్పటికీ

ఏది ఏమైనప్పటికి జగిత్యాల ప్రాంత రాజకీయ నాయకులే జర్నలిస్టులకు అండదండ కానీ జమీన్ కొరకు జిద్ద్ చేస్తేనే జీతెంగా క్యా ??? అన్నట్లుగా మాత్రం ఉండరాదు వారి దోస్తీ... సానుకూల స్పందనతో లక్ష్యం నెరవేరుతుందని ఆశ జర్నలిస్టులలో గుడిసెలో గుడ్డిదీపంలా మిణుకు మిణుకు మంటుంది .

4th ఎస్టేట్ గా ఉన్న జర్నలిస్టులకు కావాల్సింది ఎస్టేట్ లు కాదు. వాళ్ళ ఊరిలో అనుకూలమైన కొన్ని సెంట్ల స్థలం.

క్రైండ్ హార్టెడ్ కమిటెడ్ రెస్పాన్సిబుల్ లీడర్ ఎవరైనా ఉన్నారా ??? అని జర్నలిస్టు సమాజం మూగ మనసుతో ప్రశ్నిస్తుంది!!!

అర్థం చేసుకోండి అని వేడుకున్నారు.

దయచేసి శ్రమ యొక్క విలువను రోడ్డున నిలబెట్టకండి అని వేడుకున్న జర్నలిస్టుల మాటలు ఈసారి వృధా కాలేదు.

హితుడా, జర్నలిస్టు మిత్రుడా నేటి పరిస్థితులకు మన అలిశెట్టి ప్రభాకరన్న మాటలు :

శిల్పం చెక్కకముందు బండ<br>
శిక్షణ పొందకముందు మొండి<br>
ప్రతిభ వెనకాల ఎంతో ప్రయాస<br>
సో.......<br>
కాలానికి వదలకు భరోసా !!!!

మాటలను స్ఫూర్తిగా నింపుకుని మనము మన డిమాండ్లు నెరవేరే వరకు పోరాడుదాం. అనుకొని మొత్తం మీద 15 రోజులపాటు వివిధ రూపాల్లో తమ ఉద్యమాన్ని కొనసాగించారు. ఈసారి మాత్రం ఉవ్వెత్తున లేచి పడిన ఉద్యమ కెరటానికి ప్రజా సంఘాలు ,వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు, వ్యాపార, వాణిజ్య వేత్తలు, విద్యాలయాల యాజమాన్యాలు, వ్యక్తులు ఒక్కరేమిటి ప్రతి ఒక్కరు జర్నలిస్టుల న్యాయబద్ధ మైన ఇండ్ల స్థలాల దీక్షలకు మద్దతు తెలపడం కొసమెరుపే కాదు. కొంతవరకు జర్నలిస్టులలో నైతిక ధైర్యం పెంచడానికి, ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడానికి దోహదపడిందని చెప్పక తప్పదు. ఇది కేవలం స్థానిక ప్రజాప్రతినిధులకే పరిమితం కాక రాష్ట్రస్థాయిలో క్యాబినెట్ స్థాయి




సంబంధిత మంత్రితో పాటు అన్ని పార్టీల ప్రజాప్రతినిధుల మద్దతు రావడం పట్ల జర్నలిస్టులు తమకల నెరవేరుతుందని గట్టి నమ్మకంతో పాటు స్థానిక శాసనసభ్యులు, చీఫ్ విప్ అడ్లూరి, శాసనమండలి సభ్యులు ,ఐజేయు జర్నలిస్టుల నాయకుల తదితరుల సమక్షంలో నిమ్మరసం స్వీకరించడం ఒక గొప్ప ప్రయత్నానికి నాంది అని చెప్పక తప్పదు. అంతేకాకుండా దశాబ్దాల కాలంగా ఉన్న జర్నలిస్టుల కల నెరవేరుతుందని నమ్మకం సైతం కల్పించగలిగింది.

ఈ మైత్రి పర్వం లో

ప్రస్తుత అధికార హస్తం పార్టీ జగిత్యాల జర్నలిస్టులపై చేయూత హస్తం గా ఉంటుందని ఆశిద్దాం మూడు దశాబ్దాల చిరకాల వాంఛ నెరవేరుతుందని ఎదురుచూపులు నిజం కానున్నాయని ఆశావహ దృక్పథంతో జర్నలిస్టులు చూడాల్సిందే...

**జో వాదా కియా వో నిభానా పడేగా !!!**



సిరిసిల్ల రాజా<br>
విక్రాంత్ శర్మ

# జానపద కళలను కాపాడాలి





**జనగామ అగస్టు 18 (ప్రజామంటలు):** జానపద కళలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనగామ పట్టణ మున్సిపల్ చైర్మన్ పోకల జమున, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య,కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి అన్నారు. శ్రీ పద్మావతి కోలాటము బృందం మూడవ వార్షిక మహోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆర్థిక సహాకారంతో 100 మంది కళాకారులచే అంబేద్కర్ చౌరస్తా నుండి నెహ్రూ పార్క్ వరకు బారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. జాతీ జీవ నాళిక జానపద గీతిక అని అన్నారు. కార్యక్రమంలో శ్రీ పద్మావతి కోలాట బృందం అధ్యక్షురాలు పిల్లిట్ల స్రవంతి, రమేష్ మాట్లాడుతూ.... కళాకారులను ప్రోత్సహించి కళలను బ్రతికించడం ధ్యేయంగా కళాకారులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా ముందుకు వెళుతున్నమని అన్నారు. ఈ అవకాశం కల్పించిన సాంస్కృతిక శాఖ మంత్రికి, డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కళాకారుల బృందాలు చక్కని ప్రదర్శనలు చేసి భక్తులను ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో పలు కళాబృందాలు, నాయకులు పాల్గొన్నారు.

# గాంధీ లో తగ్గని జూడాలు

## ఆదివారము కూడా డ్యూటీల బహిష్కరణ



**సికింద్రాబాద్ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** కోల్ కతా ఆర్.జీ కర్ మెడికల్ కాలేజీ లో పీజీ డాక్టర్ పై జరిగిన హత్యాచారం ఘటనను నిరసిస్తూ, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కూడ గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు ఆందోళన బాట పట్టారు. తమ విధులను బహిష్కరించి, గాంధీ మెయిన్ బిల్డింగ్ వద్ద బైఠాయించి, నినాదాలు చేశారు. అమాయకురాలైన ట్రైనీ డాక్టర్ పై దారుణానికి ఒడిగట్టిన దోషులను అక్కడి ప్రభుత్వం ఇంకా శిక్షించకపోవడం హేయమని, ఇది చేతకాని ప్రభుత్వమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని జూడాలు డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ ఆందోళన ఆపేది లేదన్నారు.

# అన్నా చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ ముందస్తు రాఖి వేడుకలు

## కాశిరెడ్డి ఆదిరెడ్డి, ఎస్.ఆర్.కె. లీడ్ స్కూల్ చైర్మన్



**భీమదేవరపల్లి ఆగస్ట్ 17 (ప్రజామంటలు):** కాలం మారినా, దూరం పెరిగినా, చెరగని బంధం అన్నాచెల్లెళ్ల అనుబంధం అనురాగాలకు ఆత్మీయతలకు ప్రతీక రాఖీ పండుగ అని ఎస్ ఆర్ కె లీడ్ స్కూల్ చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి అన్నారు. శనివారం ఎస్ ఆర్ కే లీడ్ స్కూల్లో ముందస్తు రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులలో సోదర భావం పెంపొందించేందుకు, సోదరి కట్టిన రక్షాబంధన్ ని స్వీకరించిన అన్న చెల్లెకు రక్షగా ఉంటారని ఈ పండుగ పరమార్థం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# శ్రీ వీరభద్ర పరపతి సంఘం వేలేరు 44వ వార్షిక సమావేశము



వేలేరు ఆగస్ట్ 18 (ప్రజామంటలు): వేలేరు మండల కేంద్రంలోని గౌరిశెట్టి రాజన్న పీజీ హెడ్మాస్టర్ వేలేరు అధ్యక్షతన సమావేశం జరిగినది. ఇట్టి పరపతి సంఘము 1980లో స్థాపితము అయినది. నూతన కార్యవర్గం ఎన్నిక కూడా జరిగింది. నూతన అధ్యక్షునిగా విజయపురి మల్లికార్జున్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షునిగా బైరి శ్రీనివాస్, కార్యదర్శిగా, వేముల వెంకట్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జుర్రు సంపత్, కోశాధికారులుగా గౌరీశెట్టి వెంకటేశ్వర్లు, పులుగు దామోదర్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ పరపతి సంఘంలో 400 మంది సభ్యులు ఉన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, మాట్లాడుతూ సంఘాన్ని అభివృద్ధి దిశలో నడిపించుటకు శక్తివంచన లేకుండా పని చేస్తానని హామీ ఇచ్చారు.

# దోషులను కఠినంగా శిక్షించాలి మెడికో విద్యార్థి మృతికి శ్రద్ధాంజలి



**జనగామ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** దోషులను కఠినంగా శిక్షించాలని జనగామ జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్ లో పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ జోగు భాస్కర్ అధ్వర్యంలో మెడికో విద్యార్థి మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. మెడికో విద్యార్థి మృతికి కారకులైన దుండగులను శిక్షించాలని కలకత్తా నగరంలో ట్రైనీ వైద్య విద్యార్థి పై లైంగిక దాడి చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.... ప్రజలకు జీవం పోసి ప్రాణాలు కాపాడే వైద్యుల పైన లైంగిక అత్యాచారాలు జరగడం సభ్య సమాజం తలదించుకునే చర్య అన్నారు. దుండగులు ఎంతటి వారైనా కఠినమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా బాధిత కుటుంబానికి గౌరవప్రదమైన ఎక్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎదునూరి రాజ్ జోగు ఉదయ్, సాయిరాం, శేఖర్, కర్రె వెంకటేష్, సంతోష్, మను పాల్గొన్నారు.

# ఆదర్శ కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సిబ్బంది

## పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**గొల్లపల్లి ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో జమునాదేవి తెలిపారు .ఖాళీగా ఉన్న సహాయక వంటమనిషి స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు మండల స్థానికులై ఉండాలన్నారు. అదనపు సహాయక వంట మనిషికి 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ,పని చేయడంలో అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తులను కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల కార్యాలయంలో ఈనెల 22వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. అలాగే గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ లో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం పోస్టు ల కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో జమునా దేవి తెలిపారు. అభ్యర్థులు ఇంటర్ , ఎంపిహెచ్ డబ్ల్యు , ఏఎన్ఎం ట్రైనింగ్ , ఆర్ జిఎన్ఎం ట్రైనింగ్ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్ లో ఈనెల 22వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు మరియు వివరాలకు ప్రత్యేక అధికారి వి పద్మ 8328091819 లో సమర్పించాలని పేర్కొన్నారు.

# తృటిలో తప్పిన పెద్ద ప్రమాదం





**జగిత్యాల ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలో గోవిందుపల్లి వీధి వద్ద రాజీవ్ బైపాస్ మీదుగా వెళ్తూ కారు అదుపుతప్పి డివైడర్ పై దూసుకెళ్లింది. ధర్మపురి వైపు నుండి జగిత్యాల మీదుగా కిరాణా సామాగ్రి తీసుకొని కరీంనగర్ వైపు కారు వెళుతుండగా ఒక్కసారిగా కిరాణా సామాగ్రి బ్రేక్ పైన పడి ఏమి చెయ్యలేని పరిస్థితిలో అదుపు తప్పి కారును డివైడర్ పైకి దూసుకెళ్లింది. కారులో డ్రైవర్ తప్ప ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

# మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్-ఎస్ కాలికి గాయం

## పరామర్శించిన మాజీ మంత్రి మర్రి



**సికింద్రాబాద్ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్ళిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్.వీ. వీఎస్ ప్రభాకర్ కు అక్కడ జారిపడిన ప్రమాదంలో కాలికి గాయమైంది. ఆసుపత్రిలో ట్రీట్మెంట్ తీసుకున్న తర్వాత ప్రస్తుతం తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, బీజేపీ నేత మర్రి శశిధర్ రెడ్డి ఆదివారం ప్రభాకర్ ఇంటికి వెళ్ళి పరామర్శించారు.



**జగిత్యాల పట్టణ దుర్గ సిటీ ఛానల్ యజమాని మంద మల్లేశం తల్లి మల్లమ్మ అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. వెంట వైశ్య సంఘం అధ్యక్షులు మంచాల కృష్ణ నాయకులు ఉన్నారు. 'ప్రజామంటలు' తెలంగాణ జాతీయ దినపత్రిక యాజమాన్యం, పాత్రికేయ మిత్రులు తమ ప్రగాఢ సానుభూతిని వెలిబుచ్చారు.**

# బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



**జనగామ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** సామాన్య కుటుంబంలో జన్మించిన బహుజన వీరుడు, పోరాట యోధుడైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజంలో రాణించాలని జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి కోరారు. ఆదివారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయ సమావేశ మందిరంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374 వ జయంతి ఉత్సవాల వేడుకల సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించారు. తదనంతరం జ్యోతిప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలోని రఘునాథ పల్లి మండలం ఖిలషా పూర్ లో అతి సామాన్య గౌడ కుటుంబంలో జన్మించినా... శిస్తు వసూళ్ళలో ప్రజలను పెడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసి అన్ని వర్గాల పేద ప్రజల పక్షాన నిలిచి నిజాం ప్రభుత్వాన్ని ఎదురించి పోరాడిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహాయోధుడని కీర్తించారు. పాపన్న గౌడ్ ఆశయాలను భావి తరాలకు తెలిపే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని పోరాట యోధుని జీవిత చరిత్రను పాఠ్య అంశంగా విద్యార్థులకు భోదిస్తూ సమాజ హితం కోరిన పాపన్న గౌడ్ లక్షణాలను, ఆదర్శ భావాలను నేటితరం పుణికి పుచ్చుకునేలా కృషిచేయాలన్నారు. అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ...17వ శతాబ్ద కాలానికి చెందిన పాపన్న గౌడ్ స్వేచ్ఛ, సమానత్వం వంటి ఉన్నత ఆశయాలతో ఈ గడ్డ పై జన్మించడం మనందరికీ గర్వకారణమన్నారు. పాపన్నగౌడ్ జీవన ప్రయాణం పూర్తిగా వైవిధ్య భరితమన్నారు. అంతకుముందు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను స్మరిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథులు పాడిన పాటలు అలరింపజేశాయి.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమాధికారి రవీందర్, రాష్ట్ర, జిల్లా గౌడ సంఘ నాయకులతో పాటు ఇతర వర్గాల నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అధ్యక్షుడు జక్కే వీరస్వామిగౌడ్ ఆధ్వర్యంలో

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు

**జమ్మికుంట ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ 374 వ జయంతి ఉత్సవాలను రాష్ట కమిటీ ఆధ్వర్యంలో పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భముగా రాష్ట వ్యవస్థాపక అధ్యక్షులు జక్కె వీరస్వామిగౌడ్ మాట్లాడుతు గౌడ సంఘాలు బీసీ బహుజన సంఘాల పోరాటాల వల్ల అణగారిన వర్గాల ఆరాధ్యదైవం సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జయంతి వర్దంతి రాష్ట ప్రభుత్వం అధికారికంగా చేయటానికి ముందుకు రావడం హర్షించ దగ్గ విషయమని ఇదే స్పూర్తితో పాపన్న ఆశయ దిశగా జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారంలో వాటా కోసం బహుజనులు కలిసి కట్టుగా ముందుకు కదలాలి వీరస్వామిగౌడ్ పిలుపునిచ్చారు అనంతరం రాష్ట ప్రధాన కార్యదర్శి పల్సం సోమన్న గౌడ్ మాట్లాడుతూ.... ఉమ్మడి తెలుగు రాష్టాల్లో ఇప్పటికికూడా 78 ఏళ్లుగా ఉన్నత వర్గాల జెండాలు మోసి అధికారాన్ని కట్టబెడుతు బీసీలు బహుజనులు పల్లకి మోసే బోయిలుగా మిగిలి పోయారని ఇప్పటికైనా సర్దార్ సర్వాయి పాపన్న అందించిన స్ఫురితో తో సోయి తెచ్చుకొని కలిసి కట్టుగా ముందుకు పోవాలని సోమన్న గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ సంఘము నాయకులు మోతపోతుల అశోక్ గౌడ్, గండు రాజు గౌడ్ ఉప్పల్ జై భీం అసోషియేషన్ కోశాధికారి రాపోలు రవి కార్యవర్గ సభ్యులు నాగోల్ రమేష్, సాయి ప్రసాద్, వెంకటేష్, సురేష్, బొప్పెన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్, ఇంగ్లీష్ శిక్షణ

## రామ్ నగర్ లో ఇంటింటి ప్రచారం




**సికింద్రాబాద్ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** టెక్ మహీంద్రా ఫౌండేషన్ స్మార్ట్ ఉపాధి శిక్షణా కేంద్రంలో లభిస్తున్న ఉచిత కోర్సుల గురించి సిబ్బంది బాపూజీ నగర్ , మేథార్ బస్తి , జెమిని కాలని , ఫిష్ మార్కెట్ , బస్తీలలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి నిరుద్యోగులను కలిసి అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్నవారి పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్సా వృత్తి శిక్షణా కేంద్రం మేనేజర్ షేక్ మౌలా మాట్లాడుతూ... కంప్యూటర్ పరిజ్ఞానం, ఆంగ్లం లో మాట్లాడే నేర్పు, టైపింగ్ లో స్పీడ్, ఇంటర్నెట్ వాడకం గురించి పూర్తి అవగాహన ఉంటేనే ఈ రోజుల్లో మంచి ఉద్యోగం లభిస్తుందని అన్నారు. చదువు పూర్తి చేసి ఉద్యోగాలకోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు, ఆర్థిక కారణాల వలన చదువు మధ్యలో ఆపేసిన వారికి తాము ఉచితంగా శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు. నిరుద్యోగులకు కంప్యూటర్ లో టాలీ ప్రైమ్, ఎంఎస్ ఆఫీస్, అడ్వాన్స్ ఎక్సెల్, కమ్యునికేటివ్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ టైపింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్ , ఇంటర్నెట్ లపై మూడు నెలల పాటు శిక్షణా అందిస్తామని, శిక్షణ పొందిన వారికి 100 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని మరియు సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. పదవ తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు, 18 నుండి 27 ఏళ్ల మధ్య గల ఆసక్తి ఉన్ననిరుద్యోగులు ముషీరాబాద్ చౌరస్తా గాంధీ హాస్పిటల్ ఎదురుగా, ఆక్సిస్ బ్యాంకు దగ్గర, ఎవర్ గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, మొదటి అంతస్తులో ఉన్న అప్సా, టెక్ మహీంద్ర స్మార్ట్ శిక్షణా కేంద్రానికి నేరుగా రావచ్చని తెలిపారు. క్లాసులు ప్రారంభం అయ్యాయని, ఇతర వివరాలకు మొబైల్ నెంబర్ 84980 89786 లలో సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ జయశ్రీ, శ్వేతా రెడ్డి , సత్య ఇంగ్లీష్ ట్రైనర్ హరిప్రస్కస్ , విద్యార్థులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి



**హనుమకొండ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** కలెక్టర్ కార్యాలయం నందు బీసీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బహుజన పోరాట యోధుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి సందర్భంగా పోరాట యోధుడి చిత్రపటానికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య గారితో మరియు గౌడ సంఘం నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించి జయంతి ఉత్సవాలలో పాల్గొన్న గౌరవ వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా నన్ను ఆహ్వానించడం అలాగే గౌడ కులస్తులతో నాకు ఉన్న అనుబంధం చాలా గొప్పది అలాగే జనగామ జిల్లా పేరును సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లా నామకరణం చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజా ప్రతినిధులతో కలిసి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్తానని మన కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు వారి రక్షణ కోసం కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తానని అలాగే నా నియోజకవర్గంలో పలుచోట్ల నా సొంత నిధులతో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని పెట్టిచ్చేందుకు కృషి చేస్తానని తెలియజేసి అనంతరం సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను వ్యాసరచన పోటీల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్ రెడ్డి అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో అధికారులు సర్దార్ పాపన్న గౌడ్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లపల్లి రామస్వామి గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని యాదగిరి గౌడ్, గోప అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్, గట్టు రమేష్ గౌడ్, టిపిసిసి లీగల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కూనూరు రంజిత్ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్ తో పాటు గౌడ సంఘ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



**గొల్లపల్లి ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** 17వ శతాబ్దంలో దక్కన్ గడ్డపై మొదటిసారి బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరు లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గొల్లపల్లి మండలం చిలువ్వ కోడూరు, శ్రీరాముల పల్లె గ్రామాల్లో బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 348వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిలువ్వ కోడూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలు లేసి ఘన నివాళులర్పించారు. అనంత అనంతరం జరిగిన సభలో లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ యొక్క త్యాగాన్ని గుర్తు చేసి వారి యొక్క ఆశయాలను నెరవేర్చడానికి బహుజనులు అందరూ ఏకమై ముందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు చెట్ల చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు భీమా సంతోష్, చిల్వకోడూర్ గౌడ సంఘం అధ్యక్షులు దాసరి గంగన్న గౌడ్, మాజీ ఎంపీటీసీ దాసరి తిరుపతి గౌడ్, మాజీ సర్పంచులు దాసరి నారాయణ గౌడ్, మాజి సర్పంచ్ కందుకూరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుండి బుజ్జన్న, మైనారిటీ సెల్ అధ్యక్షులు యం.డి ముజ్జు విండో డైరక్టర్లు కొమురయ్య, నాగయ్య, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, సరసాని తిరుపతి రెడ్డి, పురంశెట్టి వెంకటేష్, లంబ లక్ష్మణ్, కొండ వెంకటేష్, నాయకులు సత్యనారాయణ, తదగొండ విజయ్ కుమార్, రమేష్, శోభన్, లక్ష్మణ్, రంగు శ్రీనివాస్, నేరెళ్ళ మహేష్, పురపాటి రాజిరెడ్డి, మేక స్వామి ఆవుల ప్రవీణ్ , మారుతి తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలతో రోడ్డు ప్రమాదకారకులను 2 గంటల్లోనే గుర్తించిన మల్యాల పోలీసులు



**మల్యాల ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** ఆదివారం ఉదయం జగిత్యాల జిల్లా మల్యాల మం. నూకపల్లి వరద కాలువ బ్రిడ్జి పై రోడ్డు ప్రమాదం జరిగిందన్న సమాచారం రాగా ఒక వ్యక్తి గాయలతో కిందపడి ఉండగా అక్కడ ఉన్న వారిని విచారించగా ఒక కారు అతన్ని డీ కొట్టి ఆగకుండా వెళ్లిందన్న సమాచారంతో ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి ఆకారును కేవలం రెండు గంటల వ్యవధిలోనే వేములవాడ దగ్గర స్వాధీనం చేసుకొని కారు నడిపిన వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకొని అతని పైన కేసు నమోదు చేసిన ఎస్సై నరేష్. గాయపడ్డ వ్యక్తి జనగం బాలగౌడ్ 60, గూడెం, ముస్తాబాద్ మండల ఇతను మహారాష్ట్ర నుంచి తన బైక్ పైన ముస్తాబాద్ వెళుతుండగా ఈ ఘటన జరిగిందని గాయపడ్డ వ్యక్తిని హాస్పిటల్ కు తరలించామని తెలిపారు.

# పవన్ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి చేతుల మీదుగా బహుమతి ప్రధానం



**జమ్మికుంట ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** జమ్మికుంట పట్టణ పరిధిలోని ఆబాది జమ్మికుంట 14వ వార్డుకి చెందిన బంటు పవన్ (19) ఇటీవల 20 రోజుల క్రితం గుండె పోటుతో మరణించగా పవన్ స్నేహితులతో కలిసి క్రికెట్ అంటే ఎంతో ఇష్టంగా ఆడే వాడు అని గుర్తు చేసుకుంటూ స్నేహితులు అందరూ కలిసి పవన్ పేరు మీద అతని స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు ఆదివారం ఫైనల్ మ్యాచ్ ఉండగా విజేత అయిన టీం కి జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర రావు మరియు కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్ మరియు భోగం వెంకటేష్ క్రీడాకారులను అభినందించి విజేతకి ట్రోఫీ నీ అందించారు కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ధరూర్, నర్సింగాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో.... శ్రీ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**జగిత్యాల రూరల్ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా వారి కృషిని, పట్టుదలను, వారు పోషించిన చారిత్రక పాత్రను ప్రతిఒక్కరు స్మరించుకోవాల్సిన తరుణమిది అన్నారు. కుల, మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కాలనే సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పాపన్నగౌడ్ పోరాడడం ఎంతో గొప్ప విషయం అని నర్సింగాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు పులి మల్లేశం గౌడ్ అన్నారు. వారితో పాటు ధరూర్ గౌడ సంఘం అధ్యక్షులు సుద్దాల రాజు గౌడ్, పులి నాంపేల్లి, వేంకటి, తిరుపతి, మహేష్, శ్రీనివాస్, లింగం, రాములు, శ్రీనివాస్, నాగయ్య, మధు, శ్రీకాంత్, ఎల్లయ్య, సాయి, సునీల్, జలపతి, సురేష్, గంగారాం, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత పిల్లల వైద్య శిబిరానికి భారీ స్పందన




**జగిత్యాల రూరల్ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని కల్లెడ గ్రామంలో ఆదివారం చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కల్లెడ గ్రామంలో విజ్ఞాన్ స్కూల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ కే.ప్రశాంత్ రెడ్డి పద్దెనిమిది సంవత్సరాల లోపు పిల్లలందరికీ రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత చిన్న పిల్ల వైద్య శిబిరానికి విశేషణ స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు గుండారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణంలో అనేక మార్పుల తో పిల్లలకు వస్తున్న సీజనల్ విష జ్వరాలు గుర్తించి వారికి ముందస్తు చికిత్సస్ చేశామని ఈ శిబిరం అనేకమంది పిల్లలకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. ఈ వైద్య శిబిరంలో రోగ నిర్ధారణ, చికిత్సతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామని శ్రీనివాసు తెలిపారు. ఇకముందు కూడా ఇతర గ్రామాల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని శ్రీనివాస్ వెల్లడించారు.

దాదాపు 100 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఆస్పత్రి నిర్వాహకులను గ్రామస్తులు, పలువురు ప్రజా ప్రతినిధులు ,గ్రామ యువకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అంకతి మొగిలి, సామ తిరుపతి రెడ్డి, మంచాల గంగన్న, మంచాల శ్రీనివాస్, పెద్ద గంగన్న, మల్లెల మొగిలి, చిరుత రాజేశం, బొంకూరి నారాయణ, అడ్వకేట్ లక్ష్మీనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ ఎం. రవీందర్రావు, గ్రామపంచాయతీ కారోబార్ సురేందర్, ఆసుపత్రి సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

## టీఉద్యోగుల జేఏసి రాష్ట చైర్మన్ మారం జగదీశ్వర్



**జగిత్యాల ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** రాష్ట్రంలోని ఉద్యోగుల,ఉపాధ్యాయుల,కార్మికుల,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని టీ ఉద్యోగుల జేఏసి రాష్ట్ర చైర్మన్,టీ ఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు.ఆదివారం జిల్లా టీ ఎన్జీఓల సంఘ భవన్ ఆవరణలో మొదటిసారిగా జగిత్యాల జిల్లా కేంద్రంకు వచ్చిన జగదీశ్వర్ ను టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ , జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి ల ఆధ్వర్యంలొ జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ రూపకల్పన కు 15 మందితో రాష్ట్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వక సర్కారు అని చెప్పి చివరకు సంఘాలను నిర్వీర్యం చేయాలని చూసిందని,ఒకటో తేదీన వేతనాలు కూడా ఇవ్వలేదన్నారు. కొత్త ప్రభుత్వం ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు,పెన్షనర్లకు పెన్షన్లు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏపి లో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను తిరిగి తెలంగాణకు తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. పెండింగ్ డి.ఏ.లు, పీ ఆర్ సీ అమలు, నగదు రహిత వైద్య సేవలు,317 జీవో,సి.పి.ఎస్.రద్దు,ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు,పెన్షనర్లకు డైరెక్టరేట్ ఏర్పాటు వంటి 36 సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు.త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని కలిసి మాట్లాడుతామని పేర్కొన్నారు..టీ ఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్ రెడ్డి, కోశాధికారి షాహిద్ బాబు, సహ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, టీపెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, టి.జీ.ఓ. నామకులు కందుకూరి రవి బాబు, అరిగెల అశోక్, నాల్గవ తరగతి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఉపాధ్యాయ సంఘ నాయకులు వొడ్నాల రాజశేఖర్, బైరం హరికిరణ్, కార్మిక,పెన్షనర్ల నాయకులు వెల్ముల ప్రకాష్ రావు, టిఎన్జిఒ నాయకులు రవిచంద్ర, రవిందర్, మమత, రాజేశం, సుగుణాకర్, మధుకర్, మహమూద్, భువనేశ్వర్, కుమార స్వామి, ప్రమోద్, ప్రసాద్, సురేందర్, సోహెల్, ముజాహిద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీలలో జనగామ విక్టరీ షోటోకాన్ విద్యార్థులకు స్వర్ణ, రజత పథకాలు

**జనగామ ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** యాదాద్రిభువనగిరి జిల్లా లో టైగర్స్ కుంగ్ ఫూ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో జనగామకు చెందిన విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పథకాలు కైవసం చేసుకున్నారు. అండర్ 12 సంవత్సరాల కటాస్ విభాగంలో నిక్షిత్ మణివర్ధన్ బంగారు పథకం సాధించగా, అండర్ 14 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ కటాస్ విభాగంలో అక్షిత్ మణివర్ధన్ సిల్వర్ మెడల్, అండర్ 14 సంవత్సరాల ఆరంజ్ బెల్ట్ విభాగంలో లోహిత్ సిల్వర్ మెడల్ గెలుపొందగా, మనస్విన్ బ్రాంజ్ మెడల్ గెలుపొందారు. పథకాలు సాధించిన విద్యార్థులను మాస్టర్ ఓరుగంటి సంతోష్ కుమార్ ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తో పాటు టైగర్ కుంపు అకాడమీ చీఫ్ మాస్టర్ శివకోటి,వీరాచారి మాస్టర్, టోర్నమెంట్ ఆర్గనైజర్ శ్రీనివాస్, విక్టరీ షోటోకాన్ కరాటే ఇండియా చీఫ్ రంగు మల్లికార్జున గౌడ్, మాస్టర్ కంటేష్, మాస్టర్ బాబురావు అభినందించారు.






# పూర్వ విద్యార్థుల పూర్వ కలయిక

## రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న మిత్రులు

## బాల్య స్మృతులు నెమరు వేసుకొని మురిసిపోయిన స్నేహితులు

## కాకతీయ స్కూల్ 2003 -04 పదవ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**జమ్మికుంట ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** జమ్మికుంట పట్టణంలోనే కాకతీయ హై స్కూల్ లో 2003-04 పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 20 సంవత్సరాల తర్వాత ఒక ఫంక్షన్ హాల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు గత స్మృతులు నెమరు వేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అప్పుడు ఒక విద్యార్థి పేరు చెప్పగానే వాళ్ళ కుటుంబం అంతా గుర్తుకు వచ్చేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని చెప్పారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**ఇబ్రహీంపట్నం ఆగస్ట్ 18 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ముందు 374వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఫోటోకు పూలమాల ఏసి నివాళులు అర్పించారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న మండల అధ్యక్షుడు నేరెళ్ల సుభాష్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అలనాడు గోల్కొండ కిల్లాన్ వాషించి ఎన్నో ఉద్యమాలు ఆయన జ్ఞాపకాలని కొని ఆడారు ఈ కార్యక్రమంలో డబ్బా గౌడ్ సంఘ అధ్యక్షులు ఎల్క అశోక్ గౌడ్, నేరెళ్ల, సత్యం గౌడ్, మీర్గం రాజన్న, మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు జనశంకర్, దేశెట్టి, గౌడ సంఘ సభ్యులు అబ్బూరి అంజా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కుంట గంగారం, సూదవేణి శ్రీధర్ గౌడ్, నేరెళ్ల రాజ్ కుమార్ గౌడ్, కుంట లక్ష్మీరాజ్యం గౌడ్, సుద్దాల వెంకటేష్ గౌడ్, నేరెళ్ల అంజాగౌడ్, అబ్బోరి చిన్న మల్లేష్, ఎల్క నరేష్, నేరెళ్ల రంజిత్, ఎలుక శివలింగం, అబ్బూరి మహేష్, అబ్బూరి ఈమెయిల్, గౌడ సంఘ సభ్యులు, గౌడ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com